

నేడు జాతీయ చేనేత దినోత్సవ ర్యాలీ

- జిల్లా చేనేత శాఖ అధికారి హరికృష్ణ

ప్రజాశక్తి - కడప

చేనేత దినోత్సవం సందర్భంగా ఈనెల 7న ఉదయం 9 గంటలకు స్టేట్ గెస్ట్ హౌస్ నుంచి వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ వరకు భారీ ఎత్తున ర్యాలీ నిర్వహిస్తున్నట్లు చేనేత జౌళి శాఖ జిల్లా అధికారి వి. హరికృష్ణ తెలిపారు. ర్యాలీలో డిఎంఒ, ఆప్కో, విఒ సర్వీస్ సెంటర్, చేనేత సంఘాల అధ్యక్షులు, చేనేత కార్మికులు పాల్గొంటున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం కొత్త కలెక్టరేట్లో గల వీడియో కాన్ఫరెన్స్ హాలులో సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం ఉదయం 11 గంటలకు ఆప్కో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్లో కలెక్టర్ ప్రారంభిస్తారని తెలిపారు. పై తెలిపిన కార్యక్రమాలకు చేనేత కార్మికులు పెద్ద ఎత్తున హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

మోడీ నుంచి దేశాన్ని కాపాడుకుందాం

- సిఐటియు, ఎఐటియుసి నాయకులు

ప్రజాశక్తి - కడప అర్బన్

ప్రధానమంత్రి మోడీ బారి నుంచి దేశాన్ని కాపాడుకుందామని సిఐటియు,ఎఐటియుసి నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం పాత బస్టాండ్ లో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శులు మనోహర్, నాగసుబ్బారెడ్డి మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం ఆలంభిస్తున్న కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 9న క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో కేంద్ర కార్మిక సం ఘాలు 9 చలో విజయవాడ, కడపలో హెడ్ పోస్ట్ ఆఫీస్ వద్ద నిర్వహించే నిరసన కార్యక్రమాలను విజ యవంతం చేయాలని పిలుపునిచ్చారు. మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజలపై పన్నుల భారాలు మోపుతూ, కార్మికులను బానిసలుగా మార్చేందుకు 44 లేబర్ చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్లు తెచ్చారని విమ ర్శించారు. 3 వ్యవసాయ చట్టాల రూపంలో రైతాంగ భూములను కార్పొరేట్లకు అప్పగించేందుకు ప్రయత్నించారని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఆదాయం తీసుకొచ్చే విశాఖ ఉక్కు, ఎల్ఐసి, ప్రభుత్వరంగ బ్యాంకులను ప్రయివేట్ దోపిడీదారులకు అప్పగించేందుకు తీవ్ర ప్రయత్నం చేస్తున్నారన్నారు. 8 ఏళ్ల కాలంలో ఆరు లక్షల చిన్న, మధ్య తరహా పరిశ్రమలు మూతపడ్డాయని చెప్పారు. వీటిలో పనిచేసే లక్షలాదిమంది కార్మి కులకు ఉపాధి లేకుండా పోయిందన్నారు. భారతదేశం మోడీ హయాంలో ఆకలి సూచికలో బంగ్లాదేశ్, శ్రీలంక దేశాలకంటే వెనుకపడినట్లు ప్రపంచ గణాంకాలు తెలియజేస్తున్నాయన్నారు. నిరుద్యోగాన్ని, అధిక ధరలను, ఆహార సంక్షోభాన్ని మోడ ప్రభుత్వం పరిష్కారం చేయలేక, ప్రజల ఐక్యతకు భంగం కలిగించే వివక్షపూరిత సిఎఎ, ఎన్ఆర్సి, యుసిసి చట్టాలను బలవంతంగా రుద్దే ప్రయత్నం చేస్తున్నారని ఇందులో భాగంగానే మణిపూర్ రాష్ట్రంలో వందల సంవత్సరాలుగా కలిసున్న మెయితీ, కుకీల మధ్య ఎస్టీ రిజర్వేషన్ల సమస్యను సృష్టించి మారణ హోమానికి కారకులయ్యారని తెలిపారు. మోడీ ఏం మాట్లాడాలో, ఎం చేయాలో ఆర్ఎస్ఎస్ నిర్ణయిస్తుందని, ఆర్ఎస్ఎస్ మతోన్మాద ఎజెండాను అమలు చేయడమే ప్రధాని కర్తవ్యంగా భావిస్తున్నారని విమర్శించారు. ఇక్కడ మోడీ మనసులో భారత రాజ్యాంగానికి గాని, ప్రజాస్వామ్యానికి గాని స్థానంలేదని పేర్కొన్నారు. కార్మికులకు మోడీ ప్రభుత్వం చేస్తున్న ప్రజా వ్యతిరేక నిర్ణయాలన్నీ రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం తూచా తప్పకుండా అమలు చేస్తూ రాష్ట్ర ప్రజలకు అన్యాయం చేస్తుందన్నారు. మోడీ విధానాలను రాష్ట్రంలో అమలు చేసే పార్టీలకు ప్రజలు, కార్మికులు, మేధావులు ఓటుద్వారా బుద్ధి చెప్పాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి దస్తగిరిరెడ్డి, ఎఐటియుసి నగర ప్రధాన కార్యదర్శి ఉద్దె. మద్దిలేటి, నగర అధ్యక్షుడు పిచ్చినేని సుబ్బారాయుడు, సిఐటియు నాయకులు లక్ష్మీదేవి, చంద్రారెడ్డి, డివైఎఫ్ఐ కడప నగర కార్యదర్శి ఓబులేసు, విజయ్, ఉదయ్, ఎపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి అనుబంధం కడప నగర కార్యదర్శి తారక రామారావు, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎంఆర్ నాయక్, ఎఐటియుసి కడప నగర నాయకులు నాయకులు నాగిరెడ్డి, సుబ్బరాయుడు, ఆర్ బాబు, బీమరాజు, ఈశ్వరయ్య, వెంకటాద్రి , చంద్ర, వికాస్, ఐజాక్, మునెయ్య, బాబు పాల్గొన్నారు.



నిరసన తెలియజేస్తున్న సిఐటియు , ఎఐటియుసి నాయకులు

'కస్తూర్బా' విద్యార్థుల అస్వస్థతకు

వర్కర్లే బాధ్యులా!

- టీచర్, పిఇటి, ఎస్ఒలకు బాధ్యతే లేదా
- ఉద్యోగుల వెనుక జిల్లా ఉన్నతాధికారి?
- నిష్పక్షపాత విచారణకు డిమాండ్



ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

బి.మఠం కస్తూరిభా విద్యార్థి అస్వస్థత ఘటనలో బాధ్య ఉద్యోగులను వదిలేసి కిందిస్థాయి వర్కర్లను బాధ్యులుగా చేయడంపై విమ ర్శల వర్షం కురుస్తోంది. గత జులై 23న కస్తూరిభా పాఠశాలలో ఏడవ తగరతి చదువుతున్న బి.మఠం మండలం లోని బాలాయపల్లి చెందిన విద్యార్థిని రాత్రి వేళ అస్వస్థతకు గురైన ఘటన తెలిసిందే. ఆ ఘటనలో ఆశించిన వేగంగా అధికారులు స్పందించక పోవడంపై చర్యలు తీసుకోవడం అభినందనీయం. కానీ బాధ్యత కలిగిన అధికారులపై చర్యలు తీసుకోకపోవడంలోని మతలబేమిటో తెలియడం లేదు. కస్తూరిభా పాఠశాల పర్యవేక్షణలో ఎస్ఒ, పిఇటి, రాత్రివేళ ఉపాధ్యాయుడు ప్రధాన బాధ్యులు. ఇటువంటి ప్రధాన బాధ్యులను ఉద్దేశపూర్వకంగా వదిలేసి కింది స్థాయికి చెందిన తాత్కాలిక వర్కర్లు వాచ్‌మెన్, వంటమనిషి, ఇద్దరు స్వీపర్లు, అటెండర్లను సస్పెన్షన్ చేయడంలోని హేతుబద్ధత ప్రశ్నార్థకంగా మారింది. ప్రధాన బాధ్యులైన ఉద్యో గులను ఉద్దేశపూర్వకంగా వదిలేసి కింది స్థాయిలో పనిచేసే తాత్కాలిక వర్కర్లపై చర్యలు తీసు కోవడంలోని ఔచిత్య మేమిటనే వాదన వినిపి స్తోంది. ప్రధాన బాధ్యులైన ఉద్యోగులను ఎస్ఎస్ఎకు చెందిన జిల్లా ప్రధాన బాధ్య అధికారే కాపా డుతున్నారనే విమర్శ పెద్దఎత్తున వినిపిస్తోంది. ఇందులో నిజానిజాలు ఎలా ఉన్నా బాధ్యత కలిగిన ఎస్ఒ, పిఇటి, టీచర్లను వదిలేయడం వెనుక మతలబేమిటో తెలియాల్సి ఉందనే డిమాండ్ వినిపి స్తోంది. కింది స్థాయి ఉద్యో గులను సస్పెన్షన్ తోపాటు టెర్మినేషన్ చేయాలనే తీవ్ర ఆలోచనల్లో 50 శాతం చర్యలు కూడా బాధ్యత కలిగిన ముగ్గురు అధికారులపై లేకపోవడం సందేహాలకు తావిస్తోంది. విద్యార్థి అస్వస్థత-ఐదుగురు ఉద్యోగుల సస్పెన్షన్ చేసిన ఘటనలో ఎస్ఎస్ఎ జిల్లా ఉన్న తాధికారి నిజాయతీ ప్రశ్నార్థకంగా మారింది. ఎస్ఎస్ఎ లోని ఉద్యోగులకు ఒక న్యాయం, వర్కర్లకు మరో న్యాయమా అని నిలదీస్తున్న వైనం విస్మ యాన్ని కలిగిస్తోంది. ఇదిలాఉండగా పూర్తి స్థాయి బాధ్యతలు కలిగిన ఉద్యోగులపై పక్షపాతం చూప డం వెనుక మతలబుపై నిష్పక్షపాతంగా విచారణ చేపట్టాలనే డిమాండ్ వినిపిస్తోంది.

'సి.పి బ్రౌన్' పరిశోధన కేంద్రం ప్రగతికి కృషి

- కేంద్రం సంచాలకులు రామప్రసాద్ రెడ్డి

ప్రజాశక్తి - కడప అర్బన్

సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం ప్రగతికికి శాయశక్తులా కృషి చేస్తానని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య తప్పెట రామప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులుగా ఆదివారం ఆయన బాధ్యతలు చేపట్టారు. సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం పూర్వ సంచాలకులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి, పరిశోధన కేంద్రం సిబ్బంది కలసి సంచాలకులను శాలువ, పూలమాలతో సత్కరించారు. సిబ్బంది ఎవరెవరు ఏయే విధులు నిర్వహిస్తున్నారో తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ దేశాల తెలుగు సంఘాలతో ఎంఒయు చేసుకుని కలిసి సాహిత్యకృషి చేస్తామన్నారు. సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం పటిష్ఠమైన భద్రత, పరిరక్షణ, పరిశుభ్రత, పచ్చదనంతో కూడిన సుందరీకరణ, పాఠకుల కనీస అవసరాలపై ప్రత్యేక శ్రద్ధ చూపుతానన్నారు. పాఠకులతో కూడా మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. తర్వాత పూర్వ సంచాలకులు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ పరిశోధన కేంద్రం అభివృద్ధికి తన వంతు కృషి చేశానన్నారు. ఆచార్య తప్పెట రామప్రసాద రెడ్డి తొలిరోజునే పరిశోధన కేంద్రం అభివృద్ధి పట్ల ఆయనకున్న ప్రణాళికను స్పష్టంగా తెలియజేశారని, ఆయన ఆధ్వర్యంలో పరిశోధన కేంద్రం మరింత ఉన్నతస్థితికి చేరుకుంటుందన్నారు. పరిశోధన కేంద్రం సలహామండలి సభ్యులు జానమద్ది విజయభాస్కర్, మొల్ల సాహిత్య పీఠం అధ్యక్షులు విద్వాన్ గానుగపెంట హనుమంతరావు సంచాలకులను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్ భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి, డా. చింతకుంట శివారెడ్డి, గ్రంథపాలకులు ఎన్.రమేశ్ రావు, జి.హరిభూషణ రావు, జూనియర్ అసిస్టెంట్లు ఆర్. వెంకటరమణ, ఎం.మౌనిక, సిబ్బంది సి.నీలకంఠేశ్వర్, పి.చంద్రకిశోర్, ఎస్.సుబ్రమణ్యం, బి.రాణి పాల్గొన్నారు.

చేనేత కార్మికులకు సన్మానం అభినందనీయం

- తొగటవీర క్షత్రియ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు మోడెం వీరాంజనేయ ప్రసాద్

ప్రజాశక్తి- కడప అర్బన్


చేనేత కార్మికురాలిని సన్మానిస్తున్న నాయకులు

జాతీయ చేనేత దినోత్సవాన్ని పుర స్కరించుకుని మగ్గంపై వస్త్ర నైపుణ్యం సాధించి మానవ సంరక్షణ చేసున్న మహనీయు లైన చేనేత కార్మి కులను సత్కరి ంచు కోవడం హర్షణీయమని తొగటవీర క్షత్రియ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు మోడెం వీరాంజనేయప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం వైఎస్ఆర్ ప్రెస్ క్లబ్‌లో 73 మంది చేనేత కార్మికులను ఘనంగా సత్కరించి జ్ఞాపిక, ప్రసంసా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో వ్యవసాయ రంగం తర్వాత అతిపెద్ద కుటీర పరిశ్రమ అయిన చేనేత రంగం దేశ సంస్కృతి వైభవాలకు ప్రాణం పోసిందన్నారు. ప్రభుత్వాలు చేనేత కార్మికులను ఆదుకుని వారి సంక్షేమానికి అనేక పథకాలు ప్రవేశపెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. చేనేత పరిశ్రమ అభివృద్ధికి బాటలు వేయాలన్నారు. చేనేత వస్త్రాలపై జిఎస్‌టి రద్దు చేయాలన్నారు. విస్తృతమైన మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించడంతోపాటు చేనేత కార్మికులకు గిట్టుబాటు ధర కల్పించాలన్నారు. చేనేత కార్మికులు ఆత్మహత్యలు చేసుకోకుండా వారి సంక్షేమానికి కొత్త పథకాలు తీసుకురావాలన్నారు. చేనేత కార్మికుల పిల్లలకు ప్రత్యేక స్కాలర్‌షిప్‌లు ప్రకటించి రైతుల తరహాల్లో ఆత్మహత్యలు చేసుకున్న చేనేత కార్మికులకు రూ.10లు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలన్నారు. చేనేత కార్మికుడి చిత్రంతో కూడిన ప్రత్యేక తపాలా బిల్లను ఆవిష్కరించారు. ముద్ర డ్యాన్స్ అకాడమి స్కూల్ చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో తొగటవీర క్షత్రియ సంఘం నాయకులు బండారు రఘురామయ్య, బొమ్మిశెట్టి క్రిష్ణమూర్తి, గోవిందు నాగరాజు, బొమ్మల వెంకట రత్నం, సిఆర్ఐ సునీల్ జయంత్, పరిశే నారాయణ స్వామి, కళ్యాసుధాకర్, ఉప్పు సుబ్బరాయుడు, చౌడం లక్ష్మినారాయణ, చౌడం సూరిబాబు, వెంకటనారాయణ, నాగార్జున, డాక్టర్ పట్టెం ప్రత్యూష పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్ ముట్టడి

కడప అర్బన్ : మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఈనెల 7న కలెక్టరేట్‌ను ముట్టడిస్తున్నట్లు ఎపి మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు ఇత్తడి ప్రకాష్, సుంకరరవి పేర్కొన్నారు. ఆదివారం కార్మికులను ఉద్దేశించి వారు మాట్లాడుతూ నిన్న మొన్న వచ్చిన సచివాలయం సిబ్బందిని రెగ్యులర్ చేశారని పేర్కొన్నారు. హోమ్‌గార్డులకు స్కూటీలు పంపిణీ చేశారని, రేషన్ ఆటోలు, ఆర్టీసీ వారిని ప్రభుత్వంలోకి విలీనం చేశారని తెలిపారు. మున్సిపల్ కార్మికులకు మొండి చెయ్యి చూపిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇందుకు ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం పోరాట మార్గం తప్ప మరో మార్గం లేదని చెప్పారు. కార్మికులకు ఇచ్చిన హామీ మేరకు ఆప్కాస్ సిబ్బందిని రెగ్యులర్ చేయాలని కోరారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి స్పందించి ఇచ్చిన మాట, హామీలు అమలు చేయాలని కోరారు. లేని పక్షంలో రాబోయే రోజుల్లో ఆందోళన కార్యక్రమాలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అవసరమైతే నిరవధిక సమ్మెకు వెనకాడబోమని పేర్కొన్నారు. ప్రజలు ఇబ్బందులు పడితే అందుకు భాధ్యత ప్రభుత్వానిదే అన్నారు. కలెక్టరేట్ ముట్టడిలో ప్రతి ఒక్క విభాగంలోని సభ్యులు, అధ్యక్ష, కార్యదర్శులు, మహిళలు తమ వంతు భాధ్యతగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ప్రమాణాల మెరుగుదలకు ప్రాధాన్యత

- మరో నాలుగు కొత్త కోర్సులు ప్రారంభం
- సాయంత్రం వేళలోనూ ఓపి సేవలకు శ్రీకారం
- ఎత్తుడు, వంకర, ఇంప్లాంట్ చికిత్సలు
- రిమ్స్ డెంటల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం. జ్యోత్స్న వెల్లడి

ప్రజాశక్తి - కడపప్రతినిధి

విద్య, వైద్య ప్రమాణాల మెరుగుదలకు ప్రాధాన్యత ఇస్తున్నాం. బోధనతోపాటు ఎల్ఇడి ప్రొజెక్టర్ల ద్వారా బోధన, అసిస్టెంట్ ప్రొఫెసర్ల పర్యవేక్షణలో స్టడీఅవర్స్ నిర్వహణ, మౌలిక వసతుల కల్పనపై దృష్టి సారించాం. ఈఏడాది నుంచి మరో నాలుగు పీజీ కొత్త కోర్సుల నిర్వహణకు శ్రీకారం చుట్టాం. ఇదేతరహాలో ఓపి, ఐపి వైద్యసేవల మెరుగుదలపై దృష్టి సారించాం. ఎత్తుడు, వంకర, రూట్‌కెనాల్, ఇంప్లాంట్ వంటి సమస్యలకు ఆధునిక చికిత్సలు చేస్తున్నాం. డెంటల్ కళాశాలకు చెందిన సుమారు 150 మంది బిడిఎస్ విద్యార్థులతోపాటు 23 మంది పీజీ విద్యార్థులు అందుబాటులోకి రావడంతో మెరుగైన సేవలు అందించ గలుగుతు న్నామని పేర్కొంటున్న డెంటల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.జ్యోత్స్నతో ప్రజాశక్తి ముఖాముఖి...



ముఖాముఖి..

డెంటల్ కోర్సుల వివరాలు తెలపండి?

బిడిఎస్, ఎండిఎస్ కోర్సులు అందిస్తున్నాం. ఇందులో 100 బిడిఎస్, 23 ఎండిఎస్ కోర్సుల్లో విద్యాభ్యాసం జరుగుతోంది. ఈ ఏడాది మరో నాలుగు కొత్త కోర్సులు ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో పీజీ సీట్ల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. సెప్టెంబర్ నెలాఖరు నాటికి స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

మౌలిక వసతుల కల్పనపై మీ కామెంట్?

డెంటల్ కళాశాలలో బిడిఎస్, ఎండిఎస్ విద్యార్థులకు ప్రాథమిక సదు పాయాలు, విద్యార్థులకు మెటీరియల్‌ను సరఫరా చేయాల్సి ఉంది. హాస్టళ్లలో లైటింగ్ సదుపాయాల కల్పన, తరగతి గదుల్లో కుర్చీలు, ఇతర బోధనావసరాలను ఏర్పాటుపై దృష్టి సారించాలి.

సిడిఎస్ సమావేశాల నిర్వహణ గురించి తెలపండి?

ఏడు రోజులకు ఒకసారి (సిడిఎస్) సమావేశాలు నిర్వహిస్తాం. కళాశాల అభివృద్ధి నిధి (సిడిఎస్) సమావేశానికి డిఎంఇ అధ్యక్షతన నిర్వ హిస్తాం. ఇందులో కళాశాల సంబంధిత సమస్యలను ప్రస్తావించడం జరుగుతుంది. ఆయన ఆదేశాల మేరకు అవసరమైన సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటాం.

ఫ్యాకల్టీ కొరతపై స్పందించండి?

తొమ్మిది ప్రొఫెసర్ పోస్టులకు ఎనిమిది మంది ఉన్నారు. 33 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు 26 మంది ఉన్నారు. 17 సెక్షన్లకు సంబంధించి 12 మంది ఉండాల్సి ఉంది. కానీ ఐదు ట్యూ టర్ పోస్టులను భర్తీ చేయాల్సి ఉంది. ఈ ఏడాది నుంచి మరో నాలు గు కొత్త పీజీ కోర్సు లను ప్రారంభించే నాటికి మిగిలిన ఒక ప్రెఫెసర్, 15 అసోసియే యేట్, ఏడు అ సిస్టెంట్, ఐదు ట్యూటర్ సహా కొత్త పీజీ కోర్సులకు తగిన రీతిలో పోస్టులను భర్తీ చేయాల్సి ఉంది.

డెంటల్ కోర్సుల వివరాలు తెలపండి?

తొమ్మిది కోర్సులున్నాయి. ఓరల్ మెడిసిన్ అండ్ రేడియాలజీ, ఓరల్ సర్జరీ, ప్రీడెంటానియా, ప్రొస్టోటెంటానియా, కన్సర్వేటివ్ డెంటిస్ట్రీ, పీడో డెంటాన్షియా, ఆర్థోడెన్షియా, కమ్యూనిటీ అండ్ ప్రివెంటివ్ డెంటిస్ట్రీ, ఓరల్ పాథాలజీ వంటి కోర్సులున్నాయి. వీటితోపాటు ఈ ఏడాది నుంచి ఓరల్ మెడిసిన్, ఓరల్‌సర్జరీ, పార్థోడాంటిక్స్, ప్రోస్తోడాంటిక్స్ వంటి అదనపు పీజీ కోర్సులను ప్రారంభిస్తున్నాం.

ఓపి, ఐపి చికిత్సల వివరాలు తెలపండి?

జ: ప్రతిరోజూ ఓపి కింద 140 నుంచి 180 మంది, 50 నుంచి 60 ఐపి కేసులు నమోదు చేస్తున్నాం. భవిష్యత్‌లో డెంటల్ ఓపి, ఐపి కేసుల మెరుగుదలకు కృషి చేస్తాం.

ఓపి మెరుగుదలకు తీసుకుంటున్న చర్యలేమిటి?

రోజూ ఓపి రోగులకు ఇచ్చిన ప్రిస్కిప్షన్ ప్రకారం టెస్టింగ్ రాసిన రోగులకు మరుసటి రోజు రావాల్సి ఉండేది. తాజాగా అదే రోజు సాయంత్రం మూడు నుంచి నాలుగు గంటల మధ్య వచ్చి టెస్టింగ్‌ను పరిశీలించి రోగులకు ప్రిస్కిప్షన్ రాయడం ద్వారా చికిత్సలను వేగవంతం చేస్తున్నాం. తద్వారా ఓపి, ఐపి రోగుల నమోదు పెరిగే అవకాశం ఉంది.

గద్దర్ మృతికి సిపిఎం సంతాపం

ప్రజాశక్తి - కడప అర్బన్

ప్రముఖ ప్రజా గాయకుడు గద్దర్ మృతి పట్ల సిపిఎం జిల్లా కమిటీ తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తోందని జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ తెలిపారు. ఆదివారం సిపిఎం జిల్లా కార్యాలయంలో గద్దర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గద్దర్ తన కళలతో ప్రజలను చైతన్యం పరచడానికి కృషి చేశారని తెలిపారు. అనేక దశాబ్దాల పాటు యువతను ఉర్రూత లూగించారని చెప్పారు. జానపద కళారూపాలకు విప్లవ సాహిత్యాన్ని జోడించి, ప్రజా సంస్కృతికి పట్టం కట్టారని పేర్కొన్నారు. సామాజిక, దోపిడీ రహిత సమాజం కోసం తపన పడ్డారని చెప్పారు. ఇందుకోసం నిర్బంధాన్ని అనుభవించారని తెలిపారు. ఆయన మృతి అభ్యుదయ సాహిత్య లోకానికి, ప్రజా ఉద్యమాలకు తీరనిలోటు అని తెలిపారు. వారి కుటుంబ సభ్యులకు సానుభూతిని సి.పి.ఎం. తెలుపుతున్నదని అన్నారు. కార్మికులు, కూలీలు, రైతులు, దళితులు, చేతివృత్తులు, ఆదివాసీల, అణగారిన మహిళల జీవిత వాస్తవికతపై, వందలాది పాటలు రాసి, కళారూపాలు ప్రదర్శించిన వ్యక్తిగా పేరు ఎన్నిక గన్నారన్నారు. అంబేద్కర్ ఆలోచనలను, మార్క్సిస్టు తత్వశాస్త్రంతో , ప్రజల సమస్యలపై గద్దర్ గళం ఎత్తారన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి.మనోహర్, ఎ.రామ్మోహన్, జిల్లా కమిటీ సభ్యులు బి.దస్తగిరి రెడ్డి, నగర కమిటీ సభ్యులు చంద్రారెడ్డి, ఓబులేసు యు వజన సంఘం నాయకులు ఉదయ్ తేజ పాల్గొన్నారు.



గద్దర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

దళిత మిత్ర సంఘం ఆధ్వర్యంలో.. దశాబ్దాలుగా ప్రజల కోసం అలుపెరగని పోరాటం చేస్తున్న ప్రజా గాయకుడు గద్దర్ మరణం ప్రజానీకానికి తీరని లోటని దళిత మిత్ర సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు కైపు రామాంజనేయులు ఆదివారం పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు. బడుగు, బలహీన వర్గాల విప్లవ స్ఫూర్తి గద్దర్ అని పేర్కొన్నారు. ఆయన నిరరంతరం సామాజిక న్యాయం కోసం పరితపించారని తెలిపారు. ఆయన మరణం తీరని లోటని పేర్కొన్నారు. **టిడిపి ఆధ్వర్యంలో..** ప్రజా గాయకుడు గద్దర్ మరణం పీడిత వర్గాలకు తీరనిలోటని టిడిపి జిల్లా అధికార ప్రతినిధి ఆమూరి బాలదాసు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శ్రమ జీవులు, గరీబోళ్ల హక్కులే ఊపిరిగా జీవించి ఎన్నో విప్లవ గీతాలు ఆలపించారని తెలిపారు. విప్లవ కారుడిగా అనేక ఆటుపోట్లు ఎదుర్కొన్న మహాయోధుడని పేర్కొన్నారు. గద్దర్ మరణం పట్ల ప్రగాఢ సానుభూతి తెలిపారు.

సంస్థాగతంగా పార్టీని బలోపేతం చేస్తాం

-పిసిసి అధ్యక్షులు గిడుగు రుద్రరాజు

ప్రజాశక్తి - కడప

సంస్థాగతంగా కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడమే లక్ష్యమని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షులు గిడుగు రుద్రరాజు అన్నారు. ఆదివారం కడప జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రాయలసీమలోని కడప, అన్నమయ్య, సత్యసాయి, చిత్తూరు, అనంతపురం జిల్లాలకు సంబంధించి కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ నియోజకవర్గాల సమన్వయ కమిటీ కన్వీనర్ల సమావేశం నిర్వహించారు. పిసిసి అధ్యక్షునితోపాటూ మీడియా సెల్ రాష్ట్ర చైర్మన్ ఎన్. తులసిరెడ్డి, ఎపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జంగా గౌతమ్ హాజరయ్యారు. ముందుగా ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీని సంస్థాగతంగా నిర్మించేందుకు కో-ఆర్డినేషన్ కమిటీని ఏర్పాటు చేశామన్నారు. మండల స్థాయిలో నిర్మాణం చేయడంతో పాటు 35 నియోజకవర్గాలకు కన్వీనర్లను ఏర్పాటు చేశామని చెప్పారు. రాబోవు ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ గట్టిపోటీ ఇవ్వనుందన్నారు. రాష్ట్రంలో వైసిపి, టిడిపి, జనసేన పార్టీలు బిజెపికి తొత్తులుగా మారాయని విమర్శించారు. రాయలసీమ జిల్లాల కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వర్కింగ్ ప్రెసిడెంట్ మాట్లాడుతూ ఎన్నికలకు కాంగ్రెస్ శ్రేణుల్ని చైతన్య పరచడమే లక్ష్యంగా ముందడుగు వేస్తున్నామని రాబోవు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మాత్రమే రాష్ట్రానికి ప్రత్యామ్నాయమని జగన్ బాబు పవన్లు మోడీని బలపరచడం సిగ్గుచేటని తెలిపారు. మీడియా సెల్ చైర్మన్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ ప్రధానమైన రాష్ట్రానికి సాగునీటి రంగం గుండెకాయ లాంటిదని ఈ రంగాన్ని వైసిపి, టిడిపి ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేయడం దురదృష్టకరమని పోలవరానికి బిజెపి ఒక శని గ్రహం, వైసిపి, టిడిపి రాహు కేతువులు అని విమర్శించారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు విష్ణు ప్రీతం రెడ్డి, రాష్ట్ర నాయకులు బండి జకరయ్య, నజీర్ అహ్మద్, గుండ్లకుంట శ్రీరాములు, బొజ్జా తిరుమలేష్, లీలా శ్రీనివాస్, ప్రసాద్ గౌడ్, శ్యామలాదేవి, పూల భాస్కర్ అసెంబ్లీ నియోజకవర్గాల కన్వీనర్లు, రాష్ట్ర జిల్లా కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల ఎదుట నిరసన

ప్రజాశక్తి - కడప అర్బన్



మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు

9న 'క్విట్ కార్పొరేట్ - దేశ్‌కి బచావో' పేరుతో కడపలో కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల వద్ద నిర్వహించబోయే నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వామపక్ష రైతు సంఘాల జిల్లా కార్యదర్శులు బి.దస్తగిరి రెడ్డి, ఎం.వి. సుబ్బారెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం రైతు సంఘం జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు, పేదలు, కార్మికులు, సామాన్య ప్రజల సమస్త ప్రయోజనాలను నరేంద్ర మోడి ప్రభుత్వం కార్పొరేట్లకు కట్టబెట్టడాన్ని నిరసిస్తూ 9న క్విట్ ఇండియా డే సందర్భంగా 'క్విట్ కార్పొరేట్- దేశ్ కి బచావో'నినాదంతో కడప హెడ్ పోస్టు ఆఫీస్, బిఎస్ఎన్ఎల్ కార్యాలయాల ఎదుట నిరసన నిర్వహించనున్నామని చెప్పారు. ప్రభుత్వ రంగ బ్యాంకులలోని లక్షల కోట్ల రూపాయలను కార్పొరేట్లకు ఉదారంగా అందజేస్తూ, ఈ 9 సంవత్సరాల కాలంలో దాదాపు రూ.12 లక్షల కోట్ల రుణాలను రైటాఫ్ పేరుతో రుణమాఫీ చేసిందని చెప్పారు. వ్యవసాయ సంక్షోభం ఫలితంగా అప్పుల ఊబిలో కూరుకు పోయి ఆత్మహత్యలు చేసుకుంటున్న రైతుల రుణాలు మాఫీ చేయడానికి మోడీ ప్రభుత్వానికి చేతులు రావడం లేదన్నారు. కార్పొరేట్ కంపెనీల రుణాలు మాఫీ చేయడం కాదు, రైతుల రుణాలు మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగ నిబంధనలను ఉల్లంఘిస్తూ ఓడరేవులు, ఎయిర్ పోర్టులు, విద్యుత్ సంస్థలు, రైల్వే, బొగ్గు గనులు, చివరకు ఆదివాసి, గిరిజనుల అటవీ భూములపై హక్కులను హరిస్తూ తాజాగా అటవీ చట్టానికి సవరణ పాస్ చేసిందని విమర్శించారు. ఈ చర్యలన్నీ కార్పొరేట్లకు ప్రత్యేకంగా మోడీ మానస పుత్రుడు గౌతమ్ అదానీని ప్రపంచ కుబేరులలో మొదటి స్థానానికి చేర్చేందుకు దోహదపడ్డాయన్నారు. సామాన్య ప్రజలపైన పన్నుల భారాన్ని పెంచుతూ, కార్పొరేట్లకు ఐ.టి, ఎక్సైజ్, కస్టమ్స్, కార్పొరేట్ పన్నులపైన రూ. లక్షలాది కోట్ల రూపాయల రాయితీలను ఇస్తోందని అన్నారు. మరోవైపు కార్మికుల హక్కులను హరిస్తూ నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకువచ్చిందన్నారు. ఫలితంగా బలహీన వర్గాల ప్రజల ఉపాధికి నష్టం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్పొరేట్లకు లాభాలు పెంచి ప్రజల సంపదలు లూటీ చేస్తున్న కార్పొరేట్లను తరిమికొట్టాలని పిలుపునిచ్చారు.

పిసిసి అధ్యక్షుడికి సన్మానం

ప్రజాశక్తి - కడప అర్బన్


గిడుగు రుద్రరాజును సన్మానిస్తున్న మైనార్టీ నాయకులు

నగరంలోని ఆం అండ్ బి గెస్ట్ హౌస్‌లో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు గిడుగు రుద్రరాజును సౌత్ ఇండియా మషాయిక్ బోర్డు అధ్యక్షులు సయ్యద్ జకావుద్దీన్, సౌత్ ఇండియా అధికార ప్రతినిధి సయ్యద్ సలావుద్దీన్, ప్రధాన కార్యదర్శి సయ్యద్ సిరాజుద్దీన్ బుఖారీ కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో పాదయాత్ర ఎంతో ప్రతిష్టాత్మకంగా నిలిచిందన్నారు. మషాయక్ బోర్డ్ వారు చేస్తున్న సేవలను పిసిసి అధ్యక్షులు అభినందించారు. అనంతరం రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ మీడియా సేల్ ఛైర్మన్ ఎన్ తులసి రెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గౌతమ్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఎస్. నజీర్ అహ్మద్, మషాయక్ బోర్డు సభ్యులు పాల్గొన్నారు.

దూదేకులు రాజకీయంగా ఎదగాలి

ప్రజాశక్తి-కడప సిటీ



నూతన కార్యవర్గానికి నియామక పత్రం అందజేస్తున్న నాయకులు

దూదేకులు రాజకీయంగా ఎదగినప్పుడు మాత్రమే సామాజిక గుర్తింపు, గౌరవం లభిస్తుందని సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మహమ్మద్ పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం కడప నగరంలోని ఎర్రముక్కపల్లిలోని దూదేకుల భవనంలో సంఘం రాష్ట్ర నాయకులు బాదుల్లా అధ్యక్షతన నిర్వహించిన సమా వేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దూదేకులు సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా ఎదుగుదలకు పోరాటం చేయాలన్నారు. అనంతరం సంఘం రాష్ట్ర నాయకులు రసూల్ మాట్లాడుతూ దూదేకులు రాజకీయంగా చైతన్యవంతులుగా ముందుకు రావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రాష్ట్రంలో ప్రకాశం జిల్లాలోని గిద్దలూరు నియోజకవర్గంలో దూదేకులు ఎక్కువగా ఉన్నారన్నారు. ఎంఎల్ఎ, ఎంపీ, ఎంఎల్‌సి అవకాశాల దగ్గర నుంచి ఎర్రముక్కపల్లి కార్పొరేటర్ స్థానాల కోసం పోరాటం చేసి సాధించుకోవాలన్నారు. తర్వాత అక్బర్‌వలి మాట్లాడుతూ షాదీతోఫా పథకాన్ని దూదేకులకు వర్తింపజేయడానికి పోరాటం ద్వారా సాధించామని తెలిపారు. కడప, అన్నమయ్య జిల్లాల నూతన అధ్యక్షునిగా పగడాల పెద్దన్న నాయకత్వాన జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యక్రమానికి రాష్ట్ర, జిల్లా స్థాయి దూదేకుల సంఘం నాయకులు, వందలాది మంది సంఘం సభ్యులు చెంద్రాయుడు, కుళాయప్ప, కె.రజియాభేగం,సజీనా పలువురు సర్పంచులు, ప్రజలు పాల్గొన్నారు.

గ్రంథాలయానికి 'కడుపాత్రం' పుస్తక వితరణ

ప్రజాశక్తి - చాపాడు


పుస్తకాన్ని అందజేస్తున్న తవ్వా ఓబుల్‌రెడ్డి

మైదుకూరుకు చెందిన ప్రముఖ కథా రచయిత, చరిత్రకారుడు తవ్వా ఓబుల్‌రెడ్డి తాను తాజాగా రచించిన కడు పాత్రం.. మరో పద్దెనిమిది కథలు అనే కథా సంపుటిని మైదుకూరులోని జిల్లా గ్రంథాలయ సంస్థ శాఖా గ్రంథాలయానికి ఆదివారం వితరణ చేశారు. స్థానిక గ్రంథాలయ అధికారి జి.సందీప్‌కుమార్ ఈ పుస్తకాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా సందీప్‌కుమార్ మాట్లాడుతూ రచయిత తవ్వా ఓబుల్‌రెడ్డి రచించిన గండికోట చరిత్ర, తెలుగు పౌరుషం, కడప కథ పుస్తకాలను కూడా గతంలో గ్రంథాలయానికి అందజేసినట్లు తెలిపారు.

నేడు వెదురూరులో ఆర్‌బికె ప్రారంభం

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని వెదురూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆర్‌బికె భవనాన్ని సోమవారం ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి ప్రారంభిస్తున్నట్లు ఎంపిపి టి.లక్షుమయ్య తెలిపారు. కార్యక్రమంలో మండలస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన కోరారు.


పనులు ప్రారంభిస్తున్న కొనిరెడ్డి శివచంద్రారెడ్డి

ప్రహరీ పనులకు భూమి పూజ

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

కొత్తపల్లి పంచాయతీ పరిధిలోని కొత్తపల్లె గ్రామంలో ఆదివారం రూ.12 లక్షలతో క్రిస్టియన్ శ్మశాన వాటిక ప్రహరీ నిర్మాణ పనులను సర్పంచు కొనిరెడ్డి శివచంద్రారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తపల్లె-మీనాపురం గ్రామాల మధ్యలో ఉన్న శ్మశాన వాటిక అన్యాక్రాంతం కాకుండా ఉండేందుకు ప్రహరీ నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. కొత్తపల్లిలో ముస్లిం శ్మశాన వాటిక పనులు కూడా వేగంగా జరుగుతున్నాయన్నారు. ఖాదరాబాద్, లింగాపురం, మీనాపురం, జేమ్స్ కొట్టాల తదితర ప్రాంతాల్లో హిందూ శ్మశాన వాటికల పరిరక్షణకు చర్యలు చేపట్టనున్నట్లు సర్పంచు పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ వెంకటరంగయ్య, పారిశ్రామిక వేత్త సుబ్బయ్య, మార్కు, దేవరాజు, నాగరాజు, సతీష్ పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై అవగాహన

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పులివెందుల జెన్‌టియు కళాశాలలో ఆదివారం హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో కడప రోడ్డులోని సోషల్ వెల్ఫేర్ స్కూల్, హాస్టల్‌లో కెరీర్ గైడెన్స్, వ్యక్తిత్వ వికాసంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఇందులో హెల్పింగ్ హాండ్స్ విద్యార్థులు వ్యక్తిత్వ వికాసం, కెరీర్ గైడెన్స్, మెమరీ టెక్నిక్స్ తదితర వాటి గురించి వివరించారు. ఎలా చదువుకోవాలి, ఎలా సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలో వివరించారు. ఆసక్తికర ఆటలు నిర్వహించారు. గెలిచిన వారికి బహుమతులు ప్రదానం చేశారు.



రక్షణగోడ ఏర్పాటు చేయాలని వినతి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పట్టణంలోని డిగ్రీ కాలేజీ రోడ్డులో ఉన్న వంతెన వద్ద ఇరుపక్కలా రక్షణగోడ ఏర్పాటు చేయాలని పాదచారులు, వాహనదారులు కోరుతున్నారు. రెండేళ్ల క్రితం ముందు ఈ వంతెనకు ఇరుపక్కలా రక్షణ ఉండేది, ఇటీవల వరద రావడంతో అవి కొట్టుకుపోయాయి. అప్పటి నుంచి ఇప్పటివరకు దీన్ని పట్టించుకున్న నాథుడే లేరని పేర్కొంటున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో ఈ దారిన వెళ్లాలంటే భయాందోళన చెందుతున్నామని పలువురు వాపోతున్నారు. విద్యుద్దీపాలు కూడా లేవు. ఏదైనా ప్రమాదం జరిగితే ఆ వంతెన కింద పడి పోవాల్సిందే. ఏదైనా ప్రమాదం జరగకముందే వంతెనకు రక్షణ గోడ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. వంతెన పై భాగంలో ఉన్న వాటర్ పైపులు కూడా ప్రమాదకరంగా ఉన్నాయి. ఈ దారిన వెళ్లాలంటే తస్మాత్ జాగ్రత్త అంటున్నారు. లయోలా డిగ్రీ కళాశాల, పాలిటెక్నికల్ కళాశాల విద్యార్థులు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. అధికారులు స్పందించాలని కోరుతున్నారు.

ప్రజా గాయకుడు గద్దర్ మృతి బాధాకరం

వేంపల్లె : విప్లవకవి, ప్రజా గాయకుడు గద్దర్ మృతి చెందడం బాధాకరమని పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. గద్దర్ మాట వింటే గుర్తొచ్చేది ఆయన పాటలే అన్నారు. ఉద్యమం అంటే గద్దర్ పాట ఉండాల్సిందేనని చెప్పారు. అంతలా ప్రజా జీవితంలో మమేకం అయ్యారని తెలిపారు. గద్దర్ నిరంతరం సామాజిక న్యాయం కోసమే బతికారని పేర్కొన్నారు. సామాజిక న్యాయ ప్రవక్తల భావాలు, మాటలు, వారి జీవితాలు ఎప్పటికీ స్ఫూర్తినిస్తూ జీవించే ఉంటాయని తులసిరెడ్డి తెలిపారు. గద్దర్ కుటుంబ సభ్యులకు తులసిరెడ్డి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

ఉత్సాహంగా పూర్వ విద్యార్థుల కలయిక


ఆత్మీయ సమ్మేళనంలో పూర్వవిద్యార్థులు

కొండాపురం : స్నేహితుల దినోత్సవం సందర్భంగా ఆదివారం కొండాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1995-96 బ్యాచ్ విద్యార్థులు గండికోట ప్రాజెక్టులో ఆత్మీయ సమ్మేళనం (గెట్ టుగెదర్) కార్యక్రమాన్ని ఉత్సాహంతో నిర్వహించుకున్నారు. కార్యక్రమంలో 60 మంది స్నేహితులు కలిసి అలనాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఒకరికొకరు యోగక్షేమాలను విచారించుకున్నారు. మనమంతా ఇలాగే కలకాలం స్నేహితులుగా మెలగాలని కోరుకున్నామని వారు తెలిపారు.

సుధీర్‌రెడ్డికి ఆర్థిక శాస్త్రంలో డాక్టరేట్

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్



పట్టణానికి చెందిన మార్తల సుధీర్‌రెడ్డి ఆర్థికశాస్త్రంలో డాక్టరేట్ పొందినట్లు గ్లోకల్ విశ్వ విద్యాలయ అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. సుధీర్‌రెడ్డి ఆచార్య డాక్టర్ అంజనీకుమారి జా పర్యవేక్షణలో 2011-12 నుండి 2020-21 వరకు భారతదేశంలోని ప్రైవేట్ సెక్టార్, ప్రభుత్వ రంగ బ్యాంకులలో పని చేయని ఆస్తుల తులనాత్మక అధ్యయనం అనే అంశం మీద పరిశోధన చేశారు. ఈ పరిశోధనకు గానూ గ్లోకల్ విశ్వవిద్యాలయం నుండి డాక్టరేట్ అవార్డు లభించింది.

ముమ్మరంగా నక్కలదిన్నె ఎత్తిపోతల పథకం పనులు

- రూ. 5.56 కోట్లతో పునరుద్ధరణ పనులు - 24 ఏళ్ల తర్వాత పరికరాల మార్పునకు ప్రభుత్వం శ్రీకారం

ప్రజాశక్తి - చాపాడు


ఏర్పాటు చేస్తున్న పైప్‌లైన్, గుంతలు తీస్తున్న జెసిబి యంత్రం

కుందూ నది ఒడ్డున 1999లో 2070 ఎకరాల సాగు లక్ష్యంగా ఏర్పాటు చేసిన ఎత్తిపోతల పథకం 24 సంవత్సరాల పాటు వందలాది మంది రైతులకు జీవనాధారంగా నిలిచింది. అయితే కొన్నేళ్లుగా ప్రభుత్వ ప్రోత్సాహం అందక మరుగున పడే దశకు చేరుకుంది. 135 హెచ్‌పి సామర్థ్యంగల నాలుగు మోటర్లను కుందూ నది ఒడ్డున ఏర్పాటు చేసి నీటిని తరలించి సాగుకు అందించేలా పథకం ఏర్పాటు చేశారు. ప్రారంభం నుంచి నేటి వరకు పథకం మంచి ఫలితాలను సాధిస్తూ జిల్లాలో ఉన్న ఎత్తిపోతల పథకాల్లో ఆదర్శంగా నిలిచింది. ఎత్తిపోతల పథకానికి నియమించే నూతన ఇంజనీర్లను ఈ పథకం వద్దకు ట్రైనింగ్‌కు కూడా పంపుతుంటారు. ఈ పథకం వద్ద అనేక మంది రైతులకు శిక్షణ కార్యక్రమాలను కూడా ఏర్పాటు చేశారు. ఇంతగా పేరుగాంచిన ఎత్తిపోతల పథకం ప్రారంభంలో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్లు, ప్యానెల్ బోర్డు, విద్యుత్ వైర్లు శిథిలావస్థకు చేరుకున్నాయి. తరచూ చెడిపో తుండడంతో రైతులు ఇబ్బందులు పడ్డారు. ప్రభుత్వం నుంచి ఖర్చులకు కూడా ఏమాత్రం నిధులు మంజూరు కాకపోవడంతో రైతులు కమిటీగా ఏర్పడి ఈ పథకాన్ని నెట్టుకొచ్చారు. అధిక సామర్థ్యం ఉన్న మోటర్‌లు కొనుగోలు చేయాలంటే ఆర్థికభారం కావడంతో చేసేది ఏమీ లేక ఉన్న వాటితోనే సర్దుకుంటూ వచ్చారు. పైపులు దెబ్బతిని నీరు అధికంగా వృథా అవుతుండడంతో రైతులు ఇబ్బందులు పడ్డారు. గత మూడు సంవత్సరాలుగా రైతులు పథకం మార్పు చేయాలని పలుమార్లు అధికారులకు, ప్రభుత్వానికి నివేదికను అందజేశారు. అప్పటి నుంచి ఆర్థిక శాఖ అధికారుల వద్ద నిధులు మం జూరు కాక నివేదిక అలాగే ఉండిపోయింది. గత ఆర్థిక సంవత్సరంలో ఎమ్మెల్యే రఘురామిరెడ్డి చొరవతో నిధులు మంజూరయ్యాయి.

రూ.5.56కోట్లతో పునరుద్ధరణ పనులు..

రూ.5.56కోట్లతో నక్కలదిన్నె ఎత్తిపోతల పథకం పునరుద్ధరణ పనులు కొనసా గుతున్నాయి. ఈ పథకానికి 1987లో 2వేల ఎకరాలకు సాగునీరు అందించే సామర్థ్యంతో అప్పటి ముఖ్యమంత్రి ఎన్‌టి రామారావు నిధులు మంజూరు చేసి ఎత్తిపోతల పథకానికి శ్రీకారం చుట్టారు. పథకం ప్రారంభానికి కొన్ని సంవ త్సరాలు ఇబ్బందులు ఎదురయ్యాయి. 1999లో పథకం ప్రారంభమైంది. జిల్లాలో అన్ని పథకాలు సత్ఫలితాలను ఇవ్వకపోయినా నక్కలదిన్నె ఎత్తిపోతల పథకం మాత్రం ఆదర్శంగా నిలిచింది. రైతుల్లో ఐక్యత ఉండడం వల్ల ఈ పథకం ఉత్త మంగా నిలిచిందని చెప్పవచ్చు. పథకం పరిస్థితి గురించి ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికి ఎమ్మెల్యే రఘురామిరెడ్డి వివ రించారు. అందుకు సీఎం స్పందిస్తూ ఎత్తిపోతల పథకం ఆధుని కీకరణకు రూ.5.56 కోట్లు మంజూరు చేశారు. 1650 ఎకరాలకు ఈ పథకం ద్వారా సాగునీరు అందుతుంది. గత ఏడాది జూన్‌లో పునరుద్ధరణ పనులు ప్రారంభించారు. పనులు చివరి దశలో ఉన్నాయి. ఖరీఫ్ సీజన్‌కు సాగునీరు అందించే లక్ష్యంతో పనులు పూర్తి అయ్యేలా చర్యలు తీసుకుంటున్నారు. 2.27కి.మీ. పైపులైన్, 100 హెచ్‌పి మోటర్లు 4ఏర్పాటు చేస్తున్నారు. ఇరిగే షన్ అధికారులు, ఎత్తిపోతల పథకం కమిటీ చైర్మన్ సోముల మహేశ్వర్‌రెడ్డి, సైట్ ఇంజనీర్ హనుమంతు రావ్ పనులను పర్యవేక్షిస్తున్నారు. ఎమ్మెల్యే కృషితో ఈ పథకానికి రూ.5.56 కోట్లు నిధులు మంజూరు అయ్యాయి. పైపులైన్ ఏర్పాటు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. పైపులైన్ పనులు చివరి దశకు చేరుకున్నాయి. నక్కలదిన్నె, రాజువారిపేట, రామసుబ్బమ్మ గ్రామాల రైతులకు ఎత్తిపోతల పథకం కల్ప తరువుగా మారింది. 500 మంది రైతులు ఈ పథకం కింద పంటలు సాగు చేసుకుంటున్నారు. ప్రస్తుతం పథకానికి 14 గంటలపాటు కరెంటు సదుపాయం ఉంది. మండల పరిధిలో రెండు ఎత్తిపోతల పథకాలున్నాయి. మరో మూడు ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. కుందూ నది ద్వారా వేసవిలో కూడా ఎత్తిపోతల పథకానికి నీటి వాటా కేటాయిస్తే రెండు దఫాలుగా రైతులు పంటలు సాగు చేసు కునే అవకాశం ఉంటుంది. 24 సంవత్సరాలుగా రైతుల అభివృద్ధికి సహకరించిన పథకం ప్రస్తుతం ప్రభుత్వ ప్రోత్సాహంతో రాబోయే రోజులలో మరింత మంది రైతులకు మేలు చేస్తుంది. ప్రభుత్వం నిధులు మంజూరు చేసి పనులు ముమ్మరంగా చేపడుతుండడంతో ఉన్నతాధికారులకు, ఎమ్మెల్యే రఘురామిరెడ్డికి రైతులు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

ఎత్తిపోతల పథకం ద్వారానే పంటల సాగు



ఎత్తిపోతల పథకం ద్వారా సరఫరా అయ్యే నీటి ద్వారా పంటలు సాగు చేసుకుం టున్నాం. పథకం ఏర్పాటై ఎక్కువ సంవత్సరాలు కావడంతో మోటర్లు, రిపేర్లు వచ్చేవి. ప్రస్తుతం నూతన పైపులైన్, మోటర్లు ఏర్పాటు చేస్తు డడంతో సాగునీటికి సమస్యలు తొలగనున్నాయి.

- నాగేష్, రైతు, నక్కలదిన్నె

ఈ ప్రాంత రైతులకు జీవనాధారం



నక్కలదిన్నె ప్రాంత రైతులకు షిర్డీ సాయిబాబా లిఫ్ట్ ఇరిగేషన్ 24 సంవ త్సరాలుగా జీవనాధారంగా మారింది. ప్రస్తుతం పథకం పున రుద్ధరణ పనులు ముమ్మ రంగా కొనసాగుతు న్నాయి. పనులు త్వరగా పూర్తి అయితే ఖరీఫ్ సీజన్‌లో రైతులు పంటలు సాగు చేసుకునే అవకాశం ఉంటుంది. రైతుల ఐక్యతతో పథకం ముందుకు సాగుతోంది.

- రామచంద్రయ్య, సెక్రటరీ, ఎత్తిపోతల పథకం

రైతులకు ఎంతో ఆధారం



నక్కలదిన్నె ఎత్తిపోతల పథకం ఎంతో మంది రైతులకు ఆధారం. ఈ పథకం ప్రారంభంలో నిర్వహణ ఖర్చులు తక్కువగా ఉండేవి. ప్రస్తుతం మోటర్లు, పైపులు దెబ్బ తినడంతో ఖర్చులు అధికంగా వచ్చేవి. గత ప్రభు త్వానికి పలుమార్లు నివేదిక అందించినప్పటికీ స్పందనలేదు. ట్రాన్స్‌ఫార్మర్లు ఎక్కువగా కాలిపోతూ రైతులకు సమస్యగా తయా రయ్యాయి. నిర్వహణకు అందుబాటులో ఉన్న రైతుల నుంచి చందాలు సేకరించి పథకాన్ని ముందుకు తీసుకురాగలిగాం. ప్రస్తుతం ప్రభు త్వం నిధులు మంజూరు చేయడంతో మోటర్లను మార్పు చేస్తునానరు. రాబోయే రోజుల్లో ఉపయో గకరంగా ఉంటుంది. నిధులు మంజూరు చేయిం చడంలో ఎమ్మెల్యే రఘురామిరెడ్డి సహకారం మరువరానిది.

- ఎస్.మహేశ్వర్‌రెడ్డి, ఎత్తిపోతల పథకం కమిటీ చైర్మన్

లాభాల బాటలో బీర సాగు


బీరకాయలను ప్యాక్ చేస్తున్న కూలీలు

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలో సాగుచేసిన బీర పంట రైతులకు లాభాలను చేకూరుస్తున్నాయి. మండల పరిధిలోని సీతారామపురం, రాజుపాలెం, తిప్పిరెడ్డి పల్లె గ్రామ పరిధిలో బీర పంటను రైతులు సాగు చేపట్టారు. ఎకరాకు కోతకు రెండు టన్నుల వరకు దిగుబడి వస్తుందని, మూడు నాలుగు రోజులకు ఒకసారి దిగుబడి వస్తుందని రైతులు చెప్పారు. కిలో రూ.30 లెక్కన ప్రొద్దుటూరు, హైదరాబాదు, నెల్లూరు, తిరుపతి వంటి ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు. వ్యాపారులే పంటపొలాల వద్దకు వచ్చి కొనుగోలు చేసి తీసుకెళ్తున్నారు. రైతు స్వయంగా పంటను తరలిస్తే మరో రెండు రూపాయలు అదనంగా చెల్లిస్తున్నట్లు చెల్లిస్తారు. ఎకర సాగుకు రూ. 50 వేల వరకు ఖర్చులు అవుతున్నాయని పేర్కొంటున్నారు. ఎరువులు, పురుగు మందుల ధరలు అధికంగా ఉండడంతో మరింత ఖర్చు పెరగనుంది. పది రోజులుగా ఎండ తీవ్రతకు చెట్లు దెబ్బతింటున్నాయని, దిగుబడి సరిగా లేదని రైతులు పేర్కొంటున్నారు. కర్రల పైన బీర సాగు చేపట్టడం వల్ల కాయలు పొడవుగా ఏర్పడి మంచి దిగుబడి వస్తుందని పేర్కొంటున్నారు. సీతారామాపురం గ్రామ పరిధిలో 10, మండల పరిధిలో వివిధ గ్రామాల్లో 10 ఎకరాల్లో సాగు చేపట్టారు. అట్టపెట్టెలలో బీరకాయలను పేడ్చి ఇతర ప్రాంతాలకు రవాణా చేస్తున్నారు. వరి పంట సాగు అనంతరం కూరగాయలు సాగు చేయడం వల్ల మంచి ఫలితాలు వస్తున్నాయని రైతులు చెబుతున్నారు.

బిసి కాలనీలో తాగునీటి సమస్య

ప్రజాశక్తి - ముద్దనూరు

విస్తారంగా వర్షాలు కురిసి గండికోట జలాశయంలో నీరు సమృద్ధిగా ఉన్నాయి. జలాశయం నుంచి గాలేరు-నగరి కాల్వ ద్వారా వామికొండ, సర్వరాయ సాగర్ జలాశయాలకు నీరు నిండుగా పారుతున్నా కొలవలి గ్రామంలో తాగునీరు లేక ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. కోనాపురం గ్రామం వద్ద ఉన్న వామికొండ రిజర్వాయర్ నుంచి ఉప్పలూరు, కొలవలి, కోనాపురం, మాదన్నగారిపల్లె గ్రామాలకు నీరు సరఫరా అవుతున్నాయి. రిజర్వాయర్ పక్కనే ఉన్నా తాగునీరు అందని పరిస్థితి నెలకొంది. కొలవలి గ్రామం బిసి కాలనీలో 40 కుటుంబాలున్నాయి. ఇందులో పది కుటుంబాలకు 4 నెలలుగా వీధి కుళాయిలకు తాగునీరు రాలేదని స్థానికులు వాపోతున్నారు. నీరు రాక పోవడంతో ఇబ్బందులు పడు తున్నామని వాపోతున్నారు. తాగునీరు సమస్య ఉందని సచివాలయం కార్యదర్శి దృష్టికి తెసుకెళ్లినా నిధులు లేవని నిర్లక్ష్యంగా సమాధానం చెబు తున్నారని గ్రామస్తులు అంటున్నారు. వీధి కుళాయిలకు నీరు రాలేదని పలుమార్లు కార్యదర్శికి, ఆర్ డబ్ల్యూఎస్ ఎఇకి విన్నవించినా ఫలితం లేదని ఆరోపిస్తున్నారు. కార్యదర్శి, ఆర్ డబ్ల్యూఎస్ ఎఇ విధుల పట్ల నిర్లక్ష్యం కారణంగా నీటికి కటకట ఏర్పడిందని కాలనీ ప్రజలు ఆవేదన చెందు తున్నారు. అధికారుల నిర్లక్ష్యానికి తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతు న్నామని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్య పరిష్కరించి కుళాయిలకు తాగు నీరు వచ్చేలా చర్యలు తీసుకుని ప్రజల దాహార్తిని తీర్చాలని ఎంపిడిఒకు విన్నవించామని గ్రామస్తులు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరారు.


నిరుపయోగంగా ఉన్న వీధికుళాయి

హ్యాండ్‌బాల్ ఎంపికలకు విశేష స్పందన

క్రీడాకారులకు చేయూతనందిస్తాం : లయన్స్ క్లబ్


క్రీడాకారులతో లయన్స్ క్లబ్ ఆఫ్ కడప, అన్నమయ్య అధ్యక్షులు పోతుల వెంకటరామిరెడ్డి

ప్రజాశక్తి - కడప అర్బన్

నగరంలోని డీఎస్ఎ క్రీడా మైదానంలో ఆదివారం నిర్వహించిన జిల్లాస్థాయి హ్యాండ్ బాల్ సీనియర్ విభాగం ఎంపికలకు చక్కటి స్పందన లభించింది. ఈ ఎంపికలకు ముఖ్యఅతిథిగా లయన్స్ క్లబ్ ఆఫ్ కడప, అన్నమయ్య అధ్యక్షులు పోతుల వెంకటరామిరెడ్డి విచ్చేసి ఎంపికలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని తెలిపారు. జిల్లా జట్టుకు ఎంపికయ్యే క్రీడాకారులు బాగా సాధన చేసి రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించి జిల్లాకు పేరు ప్రఖ్యాతులు తేవాలని సూచించారు. హ్యాండ్ బాల్ క్రీడలో జిల్లా నుంచి ఎందరో క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించారన్నారు. వారిని ఆదర్శంగా తీసుకొని క్రీడల్లో రాణించాలని కోరారు. జిల్లా ఒలంపిక్ సంఘం అధ్యక్షులు కె.ఎన్.సమరనాథరెడ్డి మాట్లాడుతూ క్రీడాకారులను క్రమశిక్షణ, నిరంతర సాధన, క్రీడాస్ఫూర్తి విజేతలుగా నిలుపుతాయన్నారు. జియోన్ వ్యాయామ కళాశాల చైర్మన్ రాజరత్నం ఐజాక్ మాట్లాడుతూ క్రీడాకారుల అభివృద్ధికి క్రీడాసంఘాలు కృషి చేయాలని సూచించారు. ఎపి వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షులు బి.శివశంకర్‌రెడ్డి మాట్లాడుతూ క్రీడాకారులకు గెలవాలన్న పట్టుదల, కసి ఉంటేనే ప్రత్యర్థి జట్టుపై విజయం సాధించగలరన్నారు. క్రీడాకారుల అభివృద్ధికి అహర్నిశలు పాటుపడుతున్న హ్యాండ్ బాల్ సంఘం కృషిని ఆయన అభినందించారు. జిల్లా హ్యాండ్ బాల్ సంఘం కార్యదర్శి సింధూరి, ఆర్గనైజింగ్ సెక్రటరి శివప్రసాద్ మాట్లాడుతూ జిల్లా జట్టుకు ఎంపికయ్యే క్రీడాకారులు ఈనెల 19, 20 తేదీల్లో ఒంగోలులో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందన్నారు. జిల్లా జట్టుకు ఎంపికయ్యే క్రీడాకారులకు క్యాంపు నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకుని క్రీడా ఎంపికలను ప్రారంభించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ కడప, అన్నమయ్య కార్యదర్శి కొండూరు జనార్దనరాజు, కోశాధికారి దేవతి రవీంద్రనాథ్, హ్యాండ్ బాల్ శిక్షకుడు అబ్దుల్ మునాఫ్, సీనియర్ క్రీడాకారులు సాయికిశోర్‌రెడ్డి, బసిరెడ్డి, పవన్‌కుమార్, కోటేశ్వరరావు, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఉర్దూ విభాగ ఆచార్యుల పోస్టులు మంజూరు చేయండి

ప్రజాశక్తి - కడప అర్బన్

యోగి వేమన విశ్వవిద్యాలయం పీజీ ఉర్దూ విభాగంనకు ప్రొఫెసర్ల (ఆచార్యుల) పోస్టులు మంజూరు చేయాలని రూట లెక్చరర్స్ వింగ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ సయ్యద్ వసివుల్లా, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు సత్తార్ ఫెజీ కోరారు. ఆ మేరకు ఆదివారం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఎస్.బి.అంజాద్ బాషాకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ సయ్యద్ వసివుల్లా మాట్లాడుతూ 2017 నుంచి కేవలం కాంట్రాక్ట్ లెక్చరర్లతోనే బోధన సాగిస్తున్నారని, ఇప్పటికైనా పోస్టులు మంజూరు చేసి భర్తీ చేయాలని కోరారు. ఇందుకు ఎస్‌బి అంజాద్ బాషా స్పందిస్తూ పోస్టులు మంజూరు చేసి భర్తీ చేయడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రూట రాష్ట్ర సమన్వయ కర్త ముహమ్మద్ అయ్యూబ్, డైరీ కమిటీ కో-చైర్మన్ సయ్యద్ సిరాజుద్దీన్, అకడమిక్ వింగ్ రాష్ట్ర కన్వీనర్ మస్తాన్‌వలి, నాయకులు సర్దార్ మైనుద్దీన్, ఇంతియాజ్ పాల్గొన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న రూట నాయకులు



పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే, వైసిపి శ్రేణులు

చంద్రబాబు తీరుకు నిరసనగా ర్యాలీ

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు


రూట్‌మ్యాప్‌లో ఉన్న విధంగా కాకుండా నిబంధనలను అతిక్రమించిన మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు తీరుకు నిరసనగా వైసిపి శ్రేణులు ఆదివారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ శుక్రవారం ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబు పుంగనూరు పట్టణంలో పర్యటించడం వల్ల ఘర్షణ వాతావరణం చోటుచేసుకుందన్నారు. ఈ పరిస్థితుల్లో టిడిపి వర్గీయులు పోలీసులపై రాళ్లు, కర్రలతో దాడి చేసినప్పటికీ పోలీసులు సంయమనంతో వ్యవహరించారని తెలిపారు. పర్యటనలో బాబు తీరు అభ్యంతరకరమని రాచమల్లు అన్నారు. శివాలయం సర్కిల్‌లో ధర్నా నిర్వహించారు. పోలీసులు సంయమనానికి సెల్యూట్ చేశారు.


రోగులకు మందులు పంపిణీ చేస్తున్న ఆవోపా సభ్యులు

వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి - వేంపల్లె

ఆదివారం ఆవోపా ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత హోమియో వైద్య శిబిరానికి అపూర్వ స్పందన వచ్చినట్లు ఆవోపా అధ్యక్షుడు పుల్లగూర గోవర్ధన్ తెలిపారు. స్థానిక శ్రీవాసవి కన్యక పరమేశ్వరి ఆలయంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. దాదాపు 180 మంది రోగులకు ఉచిత వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పుల్లగూర గోవర్ధన్ మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరం ఏర్పాటుకు కొప్పరపు రాజగోపాల్, రుషేం ద్ర మణీ ఆర్థికసాయం చేశారని పేర్కొన్నారు. కడపకు చెందిన వైద్యులు క్రిష్టి పాటి శేష ఫణి వైద్య పరీక్షలు చేశారని తెలిపారు. కార్యక్రమంలో ఆవోపా గౌరవా ధ్యక్షురాలు నాగసుధా, ఆర్గనైజేషన్ సభ్యులు సాయి, సత్యనారాయణ, రాధా కృష్ణ, రాము, శివ కిరణ్, శివ అరుణ్, సాయి కిరణ్, కౌసిక్, మధుకర్ పాల్గొన్నారు.



నృత్య ప్రదర్శన చేస్తున్న చిన్నారులు

అలరించిన చిన్నారుల నృత్యాలు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

స్థానిక శిల్పారామంలో ఆదివారం చిన్నారులు ప్రదర్శించిన నృత్యాలు ప్రేక్షకులను ఎంతగానో అలరించాయి. ట్రిపుల్ ఆర్ హోటల్, కేఫ్ వారి సహకారంతో శ్రీరాజా కళా నిలయం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. పెద్ద సంఖ్యలో ప్రజలు ప్రదర్శనలను తిలకించారు. నృత్య శిక్షకుడు రాజా, స్నేహిత అమృతహస్తం సేవాసమితి అధ్యక్షులు రాజు, శిల్పారామం పరిపాలన అధికారి సుధాకర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.


సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థులు

కడప అర్బన్ : నగరంలోని శిల్పారామంలో ఆదివారం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను ఎంతగానో అలరించాయి. ఆదివారం బ్రహ్మకుమారి ఈశ్వరి విశ్వవిద్యాలయం సిస్టర్ ప్రతిభ విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఫ్రెండ్షిప్ డే శుభాకాంక్షలు తెలిపారు. మిస్పా పద్మాకర్ బృందం వారు సినీ, జానపద గీతాల నృత్య ప్రదర్శన చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలను శిల్పారామం ఎఒ శివప్రసాద్ రెడ్డి పర్యవేక్షించారు. కార్యక్రమంలో శిల్పారామం సిబ్బంది పాల్గొన్నారు.



నేడు యథావిధిగా స్పందన

రాయచోటి : ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించేందుకు సోమవారం ఉదయం 10.00 గంటల నుంచి 'జగనన్నకు చెబుదాం - స్పందన' అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంతో పాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో కూడా యథావిధిగా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ గిరీష పిఎస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు తమ విజ్ఞప్తులను సంబంధిత గ్రామ, మండల, డివిజన్లలో అధికారులకు ఇవ్వాలని ఆయన సూచించారు. ముఖ్యంగా మండల, డివిజన్ స్థాయిలో సమస్యలు పరిష్కారం కాని అర్జీదారులే జిల్లా కేంద్రంలో నిర్వహించే స్పందనకు రావాలని తెలిపారు. స్పందన కార్యక్రమం ప్రారంభానికి ముందు సోమవారం ఉదయం 9.45 గంటలకు అధికారులతో స్పందన పెండింగ్ దరఖాస్తులపై సమీక్ష సమావేశం నిర్వహిస్తామన్నారు. స్పందనకు సంబంధించి ఎస్ఎల్ఎ పరిధి దాటిన దరఖాస్తులు అన్నింటిని వెంటనే పరిష్కరించి పూర్తి సమాచారంతో సమావేశానికి హాజరుకావాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలపై కూడా సమీక్షిస్తామన్నారు. అధికారులతో సహా స్పందనలో పాల్గొనే ప్రతి ఒక్కరూ కోవిడ్ ప్రోటోకాల్ తప్పనిసరిగా పాటించాలని పేర్కొన్నారు.

ప్రమాణాల మెరుగుదలకు ప్రాధాన్యత

మరో నాలుగు కొత్త కోర్సులు ప్రారంభం
సాయంత్రం వేళలోనూ ఓపి సేవలకు శ్రీకారం
ఎత్తుడు, వంకర, ఇంప్లాంట్ చికిత్సలు
రిమ్స్ డెంటల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.జ్యోత్స్న వెల్లడి

ప్రజాశక్తి - కడపప్రతినిధి



ముఖా ముఖి..

విద్య, వైద్య ప్రమాణాల మెరుగుదలకు ప్రాధాన్యత ఇస్తున్నాం. బోధనతోపాటు ఎల్ఇడి ప్రొజెక్టర్ల ద్వారా బోధన, అసిస్టెంట్ ప్రొఫెసర్ల పర్యవేక్షణలో స్టడీటూర్స్ నిర్వహణ, మౌలిక వసతుల కల్పనపై దృష్టి సారించాం. ఈఏడాది నుంచి మరో నాలుగు పీజీ కొత్త కోర్సుల నిర్వహణకు శ్రీకారం చుట్టాం. ఇదేతరహాలో ఓపి, ఐపి వైద్యసేవల మెరుగుదలపై దృష్టి సారించాం. ఎత్తుడు, వంకర, రూట్‌కెనాల్, ఇంప్లాంట్ వంటి సమస్యలకు ఆధునిక చికిత్సలు చేస్తున్నాం. డెంటల్ కళాశాలకు చెందిన సుమారు 150 మంది బిడిఎస్ విద్యార్థులతోపాటు 23 మంది పీజీ విద్యార్థులను అందుబాటులోకి రావడంతో మెరుగైన సేవలు అందించగలుగుతున్నామని పేర్కొంటున్న డెంటల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.జ్యోత్స్నతో ప్రజాశక్తి ముఖాముఖి...

డెంటల్ కోర్సుల వివరాలు తెలపండి?
బిడిఎస్, ఎండిఎస్ కోర్సులు అందిస్తున్నాం. ఇందులో 100 బిడిఎస్, 23 ఎండిఎస్ కోర్సుల్లో విద్యాభ్యాసం జరుగుతోంది. ఈ ఏడాది మరో నాలుగు కొత్త కోర్సులు ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో పీజీ సీట్ల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. సెప్టెంబర్ నెలాఖరు నాటికి స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

మౌలిక వసతుల కల్పనపై మీ కామెంట్?
డెంటల్ కళాశాలలో బిడిఎస్, ఎండిఎస్ విద్యార్థులకు ప్రాథమిక సదుపాయాలు, విద్యార్థులకు మెటీరియల్‌ను సరఫరా చేయాల్సి ఉంది. హాస్టల్లో లైటింగ్ సదుపాయాల కల్పన, తరగతి గదుల్లో కుర్చీలు, ఇతర బోధనావసరాలను ఏర్పాటుపై దృష్టి సారించాలి.

సిడిఎస్ సమావేశాల నిర్వహణ గురించి తెలపండి?
ఏడు రోజులకు ఒకసారి (సిడిఎస్) సమావేశాలు నిర్వహిస్తాం. కళాశాల అభివృద్ధి నిధి (సిడిఎస్) సమావేశానికి డిఎంఇ అధ్యక్షత నిర్వహిస్తాం. ఇందులో కళాశాల సంబంధిత సమస్యలను ప్రస్తావించడం జరుగుతుంది. ఆయన ఆదేశాల మేరకు అవసరమైన సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటాం.

ఫ్యాకల్టీ కొరతపై స్పందించండి?
తొమ్మిది ప్రొఫెసర్ పోస్టులకు ఎనిమిది మంది ఉన్నారు. 33 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు 26 మంది ఉన్నారు. 17 సెక్షన్లకు సంబంధించి 12 మంది ఉండాల్సి ఉంది. కానీ ఐదు ట్యూటర్ పోస్టులను భర్తీ చేయాల్సి ఉంది. ఈ ఏడాది నుంచి మరో నాలుగు కొత్త పీజీ కోర్సు లను ప్రారంభించే నాటికి మిగిలిన ఒక ప్రొఫెసర్, 15 అసిస్టెంట్ ప్రొఫెసర్, ఏడు అసిస్టెంట్, ఐదు ట్యూటర్ల సహా కొత్త పీజీ కోర్సులకు తగిన రీతిలో పోస్టులను భర్తీ చేయాల్సి ఉంది.

డెంటల్ కోర్సుల వివరాలు తెలపండి?
తొమ్మిది కోర్సులున్నాయి. ఓరల్ మెడిసిన్ అండ్ రేడియాలజీ, ఓరల్ సర్జరీ, ప్రీడెంటనియా, ప్రొస్తొడెంటానియా, కన్జర్వేటివ్ డెంటిస్ట్రీ, పీడో డెంటిస్ట్రీ, ఆర్థోడెంటియా, కమ్యూనిటీ అండ్ ప్రివెంటివ్ డెంటిస్ట్రీ, ఓరల్ పాథాలజీ వంటి కోర్సులున్నాయి. వీటితోపాటు ఈ ఏడాది నుంచి ఓరల్ మెడిసిన్, ఓరల్‌సర్జరీ, పార్థోడెంటిక్స్, ప్రోస్థోడెంటిక్స్ వంటి అదనపు పీజీ కోర్సులను ప్రారంభిస్తున్నాం.

ఓపి, ఐపి చికిత్సల వివరాలు తెలపండి?
జ: ప్రతిరోజూ ఓపి కింద 140 నుంచి 180 మంది, 50 నుంచి 60 ఐపి కేసులు నమోదు చేస్తున్నాం. భవిష్యత్‌లో డెంటల్ ఓపి, ఐపి కేసుల మెరుగుదలకు కృషి చేస్తాం.

ఓపి మెరుగుదలకు తీసుకుంటున్న చర్యలేమిటి?
రోజూ ఓపి రోగులకు ఇచ్చిన ప్రిస్క్రిప్షన్ ప్రకారం టెస్టింగ్ రాసిన రోగులకు మరుసటి రోజు రావాల్సి ఉండేది. తాజాగా అదే రోజు సాయంత్రం మూడు నుంచి నాలుగు గంటల మధ్య వచ్చి టెస్టింగ్‌ను పరిశీలించి రోగులకు ప్రిస్క్రిప్షన్ రాయడం ద్వారా చికిత్సలను వేగవంతం చేస్తున్నాం. తద్వారా ఓపి, ఐపి రోగుల నమోదు పెరిగే అవకాశం ఉంది.

రైల్వే అండర్ బ్రిడ్జిని వెంటనే పూర్తి చేయాలి

నిరసనలో ఆర్‌యుబి సాధన సమితి ప్రతినిధి డిమాండ్

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

పట్టణంలో రైల్వే అండర్ బ్రిడ్జిని (ఆర్‌యుబి) వెంటనే పూర్తి చేయాలని ఆర్‌యుబి సాధన సమితి ప్రతినిధి చిట్వేలి రవికుమార్ డిమాండ్ చేశారు. ఆర్‌యుబి నిర్మాణాన్ని పూర్తి చేయడంపై పాలకుల అలసత్వ వైఖరి వీడాలన్న డిమాండ్‌తో విద్యార్థుల తల్లిదండ్రులు, అసంఘటిత కార్మికులతో కలిసి ఆదివారం స్థానిక రైల్వే స్టేషన్ వద్ద నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైల్వేశాఖకు సంబంధించిన ఆర్‌యుబి పనులు ఆరేళ్ళ కిందటనే పూర్తయ్యాయని, రాష్ట్ర ప్రభుత్వ అలసత్వం వహించడంతో ఎక్కడ పనులు అక్కడే ఆగిపోయాయని పేర్కొన్నారు. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైల్వేస్టేషన్‌కు అవతలి వైపు ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జూనియర్, డిగ్రీ కళాశాలలు, కేంద్రీయ విద్యాలయం, ఎస్సీ, బీసీ హాస్టళ్లున్నాయని. అందువల్ల విద్యార్థులు సైకిళ్ళ పై ఓవర్ బ్రిడ్జి మీద రాక పోకలు సాగిస్తున్నారని తెలిపారు. వాహనాలు అతివేగంగా వెళ్ళనందున పలుమార్లు విద్యార్థులు ప్రమాదాల బారిన కూడా పడిన సంఘటనలు ఉన్నాయని తెలిపారు. హిందూ ముస్లిములకు సంబంధించిన శ్మశాన వాటికలు రైల్వే స్టేషన్ అవతలి వైపు ఉన్నాయన్నారు. అందువల్ల బలిజపల్లెరోడ్డు, గంగిరెడ్డిపాలెం, ఆర్ఎస్ రోడ్డు ప్రాంతాలకు చెందిన ఎవరైనా మరణిస్తే పై ఓవర్ బ్రిడ్జి మీదుగా తీసుకు వెళ్ళాల్సి వస్తుందన్నారు. అదనంగా దాదాపు ఒకటిన్నర కిలోమీటరు దూరం మృతదేహాన్ని తీసుకు వెళ్ళి వస్తుందన్నారు.



రైల్వే స్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న స్థానికులు

ఆర్‌యుబి పూర్తయితే ఆ ప్రాంతంలోని చిరు వ్యాపారులకు ఉపాధి అవకాశాలు మెరుగు పడి వారి జీవన ప్రమాణాలు కూడా మెరుగు పడతాయని తెలిపారు. విద్యార్థులు, ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని వెంటనే రైల్వే అండర్ బ్రిడ్జిని పూర్తి చేసేందుకు ప్రజా ప్రతినిధులు, అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించకుంటే ఆర్‌యుబి సాధనసమితి ఆధ్వర్యంలో ఉద్యమం చేస్తామని రవికుమార్ హెచ్చరించారు. కార్యక్రమంలో పగడి సుబ్బరాయుడు, సుబ్రమణ్యంరెడ్డి, రమణ, రమేష్, సురేష్, తోట హరి, జిలాని, శంకరయ్య, కాలేషా, రెడ్డప్ప పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాద బాధితులకు చెక్కులు అందజేత



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ఇటీవల చిన్నవరంపాడు వద్ద చోటు చేసుకున్న ఘోర రోడ్డు ప్రమాదంలో మృతుల కుటుంబాలకు, క్షతగాత్రులకు రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి ఆదివారం బోయినపల్లిలోని పార్టీ కార్యాలయంలో చెక్కులు పంపిణీ చేశారు. ప్రమాదంలో మృతి చెందిన నందలూరు మండలం చింత లకుంట గ్రామానికి చెందిన పప్పు వెన్నెల తండ్రి రామచంద్రారెడ్డికి రూ. 8 లక్షలు, ఆడపూరు గ్రామానికి చెందిన క్షతగాత్రురాలు కె.వెంకటసుబ్బమ్మకు రూ 2 లక్షలు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నారాయణాద్రి, అమర్, రుయా ఆసుపత్రులలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను ఇదివరకే పరామర్శించామని చెప్పారు. వారికి మెరుగైన వైద్యం అందేటట్లు ప్రధాన వైద్యులకు సూచించామన్నారు. ప్రమాద సంఘటన గురించి ముఖ్యమంత్రి క్యాంప్ కార్యాలయంతో పాటు కలెక్టర్ దృష్టికి తీసుకుపోవడంతో వెంటనే స్పందించిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రమాద బాధితులకు పరిహారం మంజూరు చేయించారని తెలిపారు. వెంటనే స్పందించిన ముఖ్యమంత్రికి ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు పాలగిరి మల్లిఖార్జున రెడ్డి, రామ రెడ్డి, సుబ్బారెడ్డి, నందలూరు మండల ఆర్ఐ సుశీల్ పాల్గొన్నారు.



బాధిత కుటుంబానికి చెక్కును అందజేస్తున్న ముక్కా రూపానందరెడ్డి

'ముక్కా' ఆర్థిక సాయం

ఓబులవారిపల్లి : ఇటీవల చిన్నవరంపాడు వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో క్షతగాత్రులకు ముక్కా రూపానందరెడ్డి ఫౌండేషన్ అధినేత ముక్కా రూపానందరెడ్డి కె.ఎస్. అగ్రహారానికి చెందిన క్షత్రగాత్రులకు రూ. 25 వేల ఆర్థిక సాయం ఆదివారం అందజేశారు. అలాగే గుడికెళ్తున్న సమయంలో ప్రమాదంలో గాయపడిన లీలావతమ్మకు ముక్కా రూపానందరెడ్డి సతీమణి ముక్కా వరలక్ష్మి రూ. 50 వేలు ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో బత్తిన వేణుగోపాల్ రెడ్డి, ఆదినారాయణ రెడ్డి తల్లెం భరత్ కుమార్ రెడ్డి, తల్లెం చంద్ర మోహన్ రెడ్డి, విష్ణు వర్ధన్ రెడ్డి, పెంచలయ్య, శ్రీనివాసులురెడ్డి దంపతులు శివారెడ్డి రాజశేఖరరెడ్డి, రాజమ్మ, హరి నారాయణ, నర్సింహులు, నీలమ్మ, శ్యామల, ఉమా, సుజాత పాల్గొన్నారు **నందలూరు:** చిన్నఓరంపాడు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన, గాయపడిన కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే మేడా మల్లికార్జున రెడ్డి ఆదివారం చెక్కులను అందజేశారు. మండలంలోని చింతలకుంట గ్రామానికి చెందిన వెన్నెల అనే విద్యార్థి ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి తండ్రి పప్పు రామ చంద్రారెడ్డికి రూ. 8 లక్షలు, ఆడపూరు గ్రామానికి చెందిన కలిశెట్టి వెంకట సుబ్బమ్మ తీవ్రంగా గాయపడగా ఆమెకు రూ. 2 లక్షలు చెక్కును అందజేశారు

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న సిఐటియు జిల్లా కార్యదర్శి భాగ్యలక్ష్మి

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి డి. భాగ్యలక్ష్మి డిమాండ్ చేశారు. ఆదివారం మధ్యాహ్న భోజన కార్మికుల సమావేశం స్థానిక ప్రభుత్వ బాలికల కళాశాల ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ బియ్యం ఇతర సామగ్రి డీలర్ల నుండి స్కూల్‌కు రవాణా చార్జీలు లేనందున ప్రభుత్వమే పాఠశాలకు సరఫరా చేయాలన్నారు. రాగిజావా పాయిసం వండినందుకు ఎటువంటి డబ్బులు చెల్లించలేదని తెలిపారు. ప్రస్తుతం పెరిగిన ధరలతో ఏజెన్సీల వారు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారని టమోటా ధర. 150 రూ పైచిలుకు ఉందని పేర్కొన్నారు. నేపథ్యంలో ప్రతి విద్యార్థికీ మెనూ ఛార్జీలు రూ. 8 నుంచి రూ. 20 వరకు పెంచాలన్నారు. రేషనలైజేషన్ పేరుతో విద్యాసంస్థలు మెర్జ్ చేయడం వల్ల మధ్యాహ్న భోజన కార్మికులు ఉపాధి కోల్పోతున్నారని వారికి ఉపాధి చూపించే భాధ్యత ప్రభుత్వానిదేనన్నారు వంటపాత్రలు గ్యాస్ సరఫరా ప్రభుత్వమే చేయాలన్నారు. గుర్తింపు కార్డులివ్వాలని డిమాండ్ చేశారు..మూడు నుండి నాలుగు నెలల పెండింగ్ బిల్లులతో పాటు ప్రతి నెలా సకాలంలో వేతనాలివ్వాలని కోరారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికులు మీసాల జయన్న, లక్ష్మిదేవి, హబీదూన్, సర్తాజ్, గౌసియా, సులోచన పాల్గొన్నారు.

రాక్షసత్వానికి నిదర్శనం చుండూరు నరమేధం

ప్రజాశక్తి-పీలేరు

రాక్షసత్వానికి నిదర్శనం చుండూరు నరమేధమని ప్రజాసంఘాల నాయకులు తెలిపారు. ఆదివారం పీలేరు పట్టణంలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ కూడలిలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి చుండూరు నరమేధంలో అశువులు బాసిన మృత వీరులకు ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాలమహనాడు అన్నమయ్య జిల్లా ఉపాధ్యక్షులు జెట్టి మల్లికార్జున, జాస్ అన్నమయ్య జిల్లా మహిళా అధ్యక్షురాలు గుండ్లురు రాజేశ్వరి, బి ఎస్‌పి పీలేరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి చీకటిపల్లి ఎర్రప్ప, రాష్ట్ర గిరిజన సమైక్య నియోజకవర్గ అధ్యక్షులు కిల్లా విజయ్ కుమార్, ఏపిఎంపిఎస్ అన్నమయ్య జిల్లా అధ్యక్షులు వేలూరు గురునాథం, మాలమహాసేన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లిగారి వెంకటస్వామి, డిబిఎస్ యాప్ జిల్లా అధ్యక్షులు బద్దె భానుప్రకాష్ మాట్లాడారు. రాజ్యాంగం ఇచ్చిన సర్వమానవ సమానత్వ స్ఫూర్తితో కల్పించిన ప్రాతినిధ్య హక్కుల అమలులో పాలక కులాలు ఎన్నో అవాంతరాలు కల్పించనప్పటికీ, దళితులు విద్యా సముపార్జన



అమరవీరులకు నివాళులర్పిస్తున్న దళిత సంఘాల నాయకులు

ద్వారా ఒక చైతన్యవంతమైన సమాజంగా పరిణామం చెందడం ప్రారంభమైందని తెలిపారు. దళితుల్లో వస్తున్న ప్రశ్నించే స్వభావాన్ని జీర్ణించుకోలేక పోయిన అగ్రవర్ణాలు, ఎప్పటికప్పుడూ దళితుల మీద దాడులకు, దోపిడీలకు తెగబడుతూనే ఉన్నాయని వాపోయారు. ఈ క్రమంలో జరిగిన మరొక అమానుష కాండే చుండూరు నరమేధం అని అన్నారు. కార్యక్రమంలో మాల మహనాడు సీనియర్ నాయకులు కె. గట్టప్ప, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తుమ్మల ధరణ్ కుమార్, జాస్ రాష్ట్ర లీగల్ అడ్వైజర్ గుండ్లురు సదాశివ, పంచాయతీ కార్మికుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ధనాసి వెంకట్రామయ్య, ఏపి మాల మహనాడు నాయకులు బొప్పసముద్రం దామోదర్, మచ్చ రెడ్డెయ్య, చీకటిపల్లి మల్లికార్జున, దప్పేపల్లి అనంద్,మద్దెల గంగాధర్, గుండ్లురూ రవీంద్ర,పాటూరి ప్రసాద్, మూడే రమేష్ నాయక్, గుర్రం లోకనాథం, ద్వారక, ప్రసాద్ పాల్గొన్నారు.

చేనేత కార్మికులకు సన్మానం అభినందనీయం

- తొగటవీర క్షత్రియ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు మోడెం వీరాంజనేయ ప్రసాద్

ప్రజాశక్తి- కడప అర్బన్



చేనేత కార్మికురాలిని సన్మానిస్తున్న నాయకులు

జాతీయం చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని మగ్గంపై వస్త్ర నైపుణ్యం సాధించి మానవ సంరక్షణ చేస్తున్న మహనీయులైన చేనేత కార్మికులను సత్కరించుకోవడం హర్షణీయమని తొగటవీర క్షత్రియ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు మోడెం వీరాంజనేయప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం వైఎస్ఆర్ ప్రెస్ క్లబ్‌లో 73 మంది చేనేత కార్మికులను ఘనంగా సత్కరించి జ్ఞాపిక, ప్రసంసా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో వ్యవసాయ రంగం తర్వాత అతిపెద్ద కుటీర పరిశ్రమ అయిన చేనేత రంగం దేశ సంస్కృతి వైభవాలకు ప్రాణం పోసిందన్నారు. ప్రభుత్వాలు చేనేత కార్మికులను ఆదుకుని వారి సంక్షేమానికి అనేక పథకాలు ప్రవేశపెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. చేనేత పరిశ్రమ అభివృద్ధికి బాటలు వేయాలన్నారు. చేనేత వస్త్రాలపై జిఎస్‌టి రద్దు చేయాలన్నారు. విస్తృతమైన మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించడంతోపాటు చేనేత కార్మికులకు గిట్టుబాటు ధర కల్పించాలన్నారు. చేనేత కార్మికులు ఆత్మహత్యలు చేసుకోకుండా వారి సంక్షేమానికి కొత్త పథకాలు తీసుకురావాలన్నారు. చేనేత కార్మికుల పిల్లలకు ప్రత్యేక స్కాలర్‌షిప్‌లు ప్రకటించి రైతుల తరహాల్లో ఆత్మహత్యలు చేసుకున్న చేనేత కార్మికులకు రూ.10లు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలన్నారు. చేనేత కార్మికుడి చిత్రంతో కూడిన ప్రత్యేక తపాలా బిల్లను ఆవిష్కరించారు. ముద్ర డ్యాన్స్ అకాడమి స్కూల్ చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో తొగటవీర క్షత్రియ సంఘం నాయకులు బండారు రఘురామయ్య, బొమ్మిశెట్టి క్రిష్ణమూర్తి, గోవిందు నాగరాజు, బొమ్మల వెంకటరత్నం, సిఆర్‌ఐ సునీల్ జయంత్, పరిశే నారాయణ స్వామి, కళ్యాసుధాకర్, ఉప్పు సుబ్బరాయుడు, చౌడం లక్ష్మినారాయణ, చౌడం సూరిబాబు, వెంకటనారాయణ, నాగార్జున, డాక్టర్ పట్టెం ప్రత్యూష పాల్గొన్నారు.

మోడీ నుంచి దేశాన్ని కాపాడుకుందాం

కడప అర్బన్ : ప్రధానమంత్రి మోడీ బారి నుంచి దేశాన్ని కాపాడుకుందామని సిఐటియు, ఎఐటియుసి నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం పాత బస్టాండ్ లో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శులు మనోహర్, నాగ సుబ్బారెడ్డి, మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం ఆలంభిస్తున్న కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 9న క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో కేంద్ర కార్మిక సం ఘాలు 9 చలో విజయవాడ, కడపలో హెడ్ పోస్ట్ ఆఫీస్ వద్ద నిర్వహించే నిరసన కార్యక్రమాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజలపై పన్నుల భారాలు మోపుతూ, కార్మికులను బానిసలుగా మార్చేందుకు 44 లేబర్ చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్లు తెచ్చారని విమ ర్శించారు. 3 వ్యవసాయ చట్టాల రూపంలో రైతాంగ భూములను కార్పొరేట్లకు అప్పగించేందుకు ప్రయత్నించారని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఆదాయం తీసుకొచ్చే విశాఖ ఉక్కు, ఎల్ఐసి, ప్రభుత్వరంగ బ్యాంకులను ప్రయివేట్ దోపిడీ దారులకు అప్పగించేందుకు తీవ్ర ప్రయత్నం చేస్తున్నారన్నారు. 8 ఏళ్ల కాలంలో ఆరు లక్షల చిన్న, మధ్య తరహా పరిశ్రమలు మూతపడ్డాయని చెప్పారు. వీటిలో పనిచేసే లక్షలాదిమంది కార్మి కులకు ఉపాధి లేకుండా పోయిందన్నారు. మోడీ ఏం మాట్లాడాలో, ఎం చేయాలో ఆర్ఎ స్ఎస్ నిర్ణయిస్తుందని, ఆర్ఎస్ఎస్ మతోన్మాద ఎజెండాను అమలు చేయడమే ప్రధాని కర్తవ్యంగా భావిస్తున్నారని విమర్శించారు. ఇక్కడ మోడీ మనసులో భారత రాజ్యాంగానికి గాని, ప్రజాస్వామ్యానికి గాని స్థానం లేదని పేర్కొన్నారు. కార్మికులకు మోడీ ప్రభుత్వం చేస్తున్న ప్రజా వ్యతిరేక నిర్ణయాలన్నీ రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం తూచా తప్పకుండా అమలు చేస్తూ రాష్ట్ర ప్రజలకు అన్యాయం చేస్తుందన్నారు. మోడీ విధా నాలను రాష్ట్రంలో అమలు చేసే పార్టీలకు ప్రజలు, కార్మికులు, మేధావులు ఓటుద్వారా బుద్ధి చెప్పాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి దస్తగిరి రెడ్డి ఎఐటియుసి నగర ప్రధాన కార్యదర్శి ఉద్దె. మద్దిలేటి, సిఐటియు నాయకులు లక్ష్మీదేవి, చంద్రారెడ్డి, డివైఎఫ్ఐ కడప నగర కార్యదర్శి ఓబులేసు, విజయ్, ఉదయ్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎంఆర్ నాయక్, ఎఐటియుసి కడప నగర నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పిసిసి అధ్యక్షులు గిడుగు రుద్రరాజు

సంస్థాగతంగా పార్టీని బలోపేతం చేస్తాం

-పిసిసి అధ్యక్షులు గిడుగు రుద్రరాజు

ప్రజాశక్తి - కడప

సంస్థాగతంగా కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడమే లక్ష్యమని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షులు గిడుగు రుద్రరాజు అన్నారు. ఆదివారం కడప జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రాయలసీమలోని కడప, అన్నమయ్య, సత్యసాయి, చిత్తూరు, అనంతపురం జిల్లాలకు సంబంధించి కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ నియోజకవర్గాల సమన్వయ కమిటీ కన్వీనర్ల సమావేశం నిర్వహించారు. పిసిసి అధ్యక్షునితోపాటూ మీడియా సెల్ రాష్ట్ర చైర్మన్ ఎన్. తులసిరెడ్డి, ఎపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జంగా గౌతమ్ హాజరయ్యారు. ముందుగా ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీని సంస్థాగతంగా నిర్మించేందుకు కో-ఆర్డినేషన్ కమిటీని ఏర్పాటు చేశామన్నారు. మండల స్థాయిలో నిర్మాణం చేయడంతో పాటు 35 నియోజకవర్గాలకు కన్వీనర్లను ఏర్పాటు చేశామని చెప్పారు. రాబోవు ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ గట్టిపోటీ ఇవ్వనుందన్నారు. రాష్ట్రంలో వైసిపి, టిడిపి, జనసేన పార్టీలు బిజెపికి తొత్తులుగా మారాయని విమ ర్శించారు. రాయలసీమ జిల్లాల కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వర్కింగ్ ప్రెసిడెంట్ మాట్లాడుతూ ఎన్నికలకు కాంగ్రెస్ శ్రేణుల్ని చైతన్య పరచ డమే లక్ష్యంగా ముందడుగు వేస్తున్నామని రాబోవు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మాత్రమే రాష్ట్రానికి ప్రత్యామ్నాయమని జగన్ బాబు పవ న్లు మోడీని బలపరచడం సిగ్గుచేటని తెలిపారు. మీడియా సెల్ చైర్మన్ మాట్లాడుతూ ఆంధ్ర ప్రదేశ్ వ్యవసాయ ప్రధానమైన రాష్ట్రానికి సాగునీటి రంగం గుండెకాయ లాంటిదని ఈ రంగాన్ని వైసిపి, టిడిపి ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేయడం దురదృష్టకరమని పోలవరానికి బిజెపి ఒక శని గ్రహం, వైసిపి, టిడిపి రాహు కేతువులు అని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభు త్వాలు సాగునీటి రంగానికి అధిక ప్రాముఖ్యత ఇచ్చేవని మొత్తం వార్షిక బడ్జెట్లో 15శాతం నిధులు సాగునీటి రంగానికి కేటాయించాయని అన్నారు. కాంగ్రెస్ హయాంలోనే శ్రీశైలం రిజర్వాయర్, నాగార్జునసాగర్, ప్రకాశం బ్యారేజీ, ధవలేశ్వరం బ్యారేజీలు, నిర్మించబడ్డాయని తద్వారా ఆంధ్రప్రదేశ్ అన్నపూర్ణగా పేరుగాంచిందన్నారు. తెలుగుగంగ, గాలేరు నగరి, హంద్రీనీవా, వెలుగొండ, పులిచింతల ప్రాజెక్టులలో సింహభాగం హ క్కులు కాంగ్రెస్ పాలనలో పూర్తి అయ్యాయన్నారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు విష్ణు ప్రీతం రెడ్డి, రాష్ట్ర నా యకులు బండి జకరయ్య, నజీర్ అహ్మద్, గుండ్లకుంట శ్రీరాములు, బొజ్జా తిరు మలేష్, లీలా శ్రీనివాస్, ప్రసాద్ గౌడ్, శ్యామలాదేవి, పూల భాస్కర్ అసెంబ్లీ నియోజకవర్గాల కన్వీనర్లు, రాష్ట్ర జిల్లా కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

సమావేశానికి హాజరైన రెడ్డిసాహెబ్

మదనపల్లె అర్బన్ : కడప నగరంలో నిర్వహించిన అసెంబ్లీ నియోజకవర్గాల సమన్వయ కమిటీ కన్వీనర్ల సమావేశానికి పీలేరు నియోజకవర్గ కన్వీనర్ ఎస్.రెడ్డీ సాహెబ్, మదనపల్లి కాంగ్రెస్ పార్టీ నాయకులు సురేంద్ర రెడ్డి, మహబూబ్ పీర్, జీవన్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్.రెడ్డి సాహెబ్ మాట్లాడుతూ నియోజకవర్గ స్థాయిలో పార్టీ బలోపేతంపై పిసిసి అధ్యక్షులు దిశానిర్దేశం చేశారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని, కాంగ్రెస్ పార్టీ గెలుపు ఆవశ్యకత గురించి తెలియజేశారని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ పూర్వవైభవానికి శక్తి వంచన లేకుండా కృషి చేయాలని సూచించినట్లు తెలిపారు.

రాయచోటి కాంగ్రెస్ కన్వీనర్‌గా పూల భాస్కర్

రాజంపేట అర్బన్ : ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు గిడుగు రుద్రరాజు, ఆంధ్ర ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర మీడియా చైర్మన్ నర్రెడ్డి తులసి రెడ్డి, రాయలసీమ వర్కింగ్ ప్రెసిడెంట్ జంగా గౌతమ్ అధ్యక్షతన కడప నగరంలోని కాంగ్రెస్ కమిటీ హాల్ ఇందిరా భవన్‌లో కడప, అన్నమయ్య జిల్లాలోని పార్లమెంట్ వారిగా ఉన్న నియోజకవర్గాలకు కన్వీనర్లును నియమాకం చేశారు. అన్నమయ్య జిల్లాలోని రాజంపేట పార్లమెంట్ పరిధిలోని 7 నియోజకవర్గాలకు కన్వీనర్లును నియమాకం చేస్తూ ఆంధ్ర ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు ఉత్తర్వులు జారీ చేశారని. రైల్వేకోడూర్ కన్వీనర్‌గా షేక్ అల్లాబాకాష్, రాయచోటి కన్వీనర్‌గా పూల భాస్కర్, తంబాలపల్లి కన్వీనర్‌గా సోమశేఖర్ రెడ్డి, పీలేరు కన్వీనర్‌గా రెడ్డి సాహెబ్, రాజంపేట కన్వీనర్‌గా చంద్రశేఖర్ రెడ్డి, పుంగనూరు కన్వీనర్‌గా ఎం. రామచంద్ర, మదనపల్లి కన్వీనర్‌గా లీలాశ్రీనివాస్‌ను నియమించారు. ఈనెల 25లోగా మండల కమిటీలు, అనుబంధ సంఘాలు కమిటీలను పూర్తి చేయవలసిందిగా ఆదేశిలిచ్చారు. పార్టీ బలోపేతం కోసం సూచనలు సలహాలిచ్చారు.

కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా వేల్పుల శ్రీధర్



మదనపల్లె అర్బన్ : పట్టణానికి చెందిన వేల్పుల శ్రీధర్ కాంగ్రెస్ పార్టీ ఒబిసి రాష్ట్ర అధికార ప్రతినిధిగా నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం కాంగ్రెస్ పార్టీ ఒబిసి రాష్ట్ర అధ్యక్షులు మూల వెంకటరావు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సం దర్భంగా వేల్పుల శ్రీధర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడానికి నిరంతరం శ్రమించి, పార్టీని తిరిగి అధికారంలోకి తీసుకురావడం, రాహుల్ గాంధీని ప్రధానిని చేయడానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. గతంలో మదనపల్లి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి నిర్విరామ కృషి చేశా నని, దీంతో పార్టీ రాష్ట్ర అధినాయకత్వం తనను రాష్ట్ర అధికార ప్రతినిధిగా నియ మించడం ఆనందంగా ఉందని తెలిపారు. తనకు పదవీని అప్పగించిన పిసిసి అధ్యక్షులు గిడుగు రుద్రరాజు, ఇతర రాష్ట్ర నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలు పుతున్నానన్నారు. శ్రీధర్‌కు పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపారు.

నేడు జాతీయ చేనేత దినోత్సవ ర్యాలీ

రాయచోటి : 9వ జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకొని కలెక్టర్ గిరీష పిఎస్ ఆదేశాల మేరకు ఈనెల 7న రాయచోటి పట్టణంలో '9వ జాతీయ చేనేత దినోత్సవ ర్యాలీ' నిర్వహించనున్నట్లు జిల్లా చేనేత జౌళి శాఖ అధికారి పి. శ్రీనివాసుల రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సోమవారం ఉదయం 9 గంటలకు ప్రభుత్వ జూనియర్ కళాశాలగ్రౌండ్(బంగ్లా) నుంచి మహాత్మా గాంధీ విగ్రహం కూడలి మీదుగా ఆర్టీసీ బస్టాండ్ వద్దనున్న ఎన్‌జిఒ హోమ్ వరకు చేనేత కార్మికులు, నాయకులు విద్యార్థులతో గొప్ప ర్యాలీ నిర్వహిస్తారన్నారు. అనంతరం ఉదయం 10 గంటలకు ఎన్జీవో హోమ్‌లో చేనేత దినోత్సవ సభ ఉంటుందని, చేనేత కార్మికులు, చేనేత నాయకులు, ప్రజలు పాల్గొన్నాలని కోరారు.

అక్రమ కేసు అన్యాయం

రాయచోటి : ఈనెల 4న పుంగనూరులో చోటు చేసుకున్న సంఘటనలో తనపై పోలీసులు అక్రమంగా కేసు నమోదు టిడిపి రాయచోటి నియోజకవర్గ నాయకులు మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తనపై కేసు నమోదుచేయడం అన్యాయమని తెలిపారు.

తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి

రాయచోటి టౌన్ : ప్రతి ఒక్కరూ విధిగా హెల్మెట్ కలిగి ఉండాలని రాయచోటి ట్రాఫిక్ ఎస్ఐ రఫీ అన్నారు. ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించడం వల్ల తమ ప్రాణాలను కాపా డుకోవచ్చునన్నారు.మైనర్ యువకులు బైక్‌లు నడిపితే ఆ బాధ్యత తల్లి దండ్రులే వహించవలసి వస్తుందని, యువకులు బైక్‌లను మితిమీరిన వేగంతో నడిపితే లైసెన్స్‌తోపాటు వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. పాదాచారులు రోడ్డు దాటేటప్పుడు ఇరువైపులా చూసుకొని దాటాలని రాంగ్ రూట్లో వాహనాలు నడపరాదని అన్నారు. సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయరాదు అన్నారు. ఫుట్‌పాత్‌లపై దుకాణదారులు ఆక్రమిస్తే భారీ జరిమానా విధిస్తామని చెప్పారు. వాహనదారులు నిబంధనలు పాటించి సహకరించాలని కోరారు.



పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న జస్టిస్ లక్ష్మారెడ్డి

హార్సిలీహిల్స్‌ను సందర్శించిన లోకాయుక్త చైర్మన్

ప్రజాశక్తి -బి.కొత్తకోట

రాష్ట్ర లోకాయుక్త చైర్మన్ జస్టిస్ లక్ష్మారెడ్డి ఆదివారం మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన హార్సిలీహిల్స్‌ను సందర్శించారు. ముందుగా పోలీస్ అధికారుల నుండి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం హార్సిలీహిల్స్ లోని పలు ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆహ్లాదకరమైన వాతావరణానికి హార్సిలీహిల్స్ ప్రసిద్ధి గాంచిందన్నారు.దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులకు ఇక్కడకి విచ్చేసి ప్రకృతి అందాలను ఆస్వాదిస్తుంటారన్నారు. గతంతో పోల్చుకుంటే ప్రస్తుతం హార్సిలీహిల్స్ అన్నివిధాల అభివృద్ధి సాధించిందన్నారు.పర్యాటకులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంలో అధికారులు, సిబ్బంది కృషి అమోఘమని కితాబుని ఇచ్చారు. తరచూ ఇక్కడికి కుటుంబ సభ్యులతో విచ్చేసి విడిది చేసి వెళ్తుంటామన్నారు. ఈ ప్రాంతంతో తనకు విడదీయరాని అనుబంధ ఉందన్నారు.

టిటిడి చైర్మన్‌కు సన్మానం

ప్రజాశక్తి-రైల్వేకోడూరు



భూమన కరుణాకర్‌రెడ్డిని సన్మానిస్తున్న సుకుమార్‌రెడ్డి

టిటిడి చైర్మన్‌గా నియమితులైన తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డిని తిరుపతిలోని ఆయన నివాసంలో జిల్లా రైతు సలహా మండలి చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి సన్మాని ంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిటిడిలో నూతన సంస్కరణలకు నాంది పలకాలని కోరారు.

గద్దర్ మృతి పీడిత వర్గాలకు తీరని లోటు

రాయచోటిటౌన్ : ప్రముఖ ప్రజా గాయకుడు గద్దర్ మృతి పట్ల సిపియం తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తున్నట్లు జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజా యుద్ధనౌక గాయకుడు గద్దర్ ఆదివారం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. గద్దర్ మృతి పట్ల సంతాపం తెలిపుతూ ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ తన కళలతో ప్రజలను చైతన్య పరచడానికి గద్దర్ కృషి చేశారని, అనేక దశాబ్దాల పాటు యువతను ఉర్రూతలూగించారని పేర్కొన్నారు. జానపద కళారూపాలకు విప్లవ సాహిత్యాన్ని జోడించి, ప్రజా సంస్కృతికి పట్టం కట్టారని కొనియాడారు. సామాజిక మార్పు కోసం తపన పడ్డారని, ఇందుకోసం నిర్బంధాన్ని అనుభవించారని తెలిపారు. గద్దర్ మృతి అభ్యుదయ సాహిత్య లోకానికి, ప్రజా ఉద్యమాలకు తీరని లోటు అని అన్నారు. వారి కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపారు. **తంబళ్లపల్లి :** ప్రజా యుద్ధ నౌక గద్దర్ మృతి పీడిత వర్గాలకు తీరని లోటని జననాట్యమండలి మాజీ సభ్యులు, ఆయన అభిమానులు పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. హక్కులు హరించబడుతున్న ఈ సమాజానికి తన మాట, పాట ద్వారా అలుపెరుగని పోరాటం చేసిన విప్లవ వీరుడు గద్దర్ అన్నారు. గద్దర్ తుదిశ్వాస వరకు పీడిత వర్గాల విముక్తి కోసం పని చేశాడన్నారు. ఈ పోరాటంలో ఆయన ఎన్నో కష్టాలు ఎదుర్కొన్నారని ఈ సందర్భంగా వారు గుర్తు చేశారు. గద్దర్ తన పాట ద్వారా పీడిత వర్గాలను విప్లవ బాట పట్టించారన్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాతో గద్దర్ విడదీయరాని బంధం ఉందని ఈ సందర్భంగా ఆయన అభిమానులు గుర్తు చేశారు. తెలంగాణ ఉద్యమంలో కూడా గద్దర్ కీలక పాత్ర పోషించారన్నారు. ఆయన అకాల మరణం తమను తీవ్ర మనోవేదనకు గురి చేసిందన్నారు. ఈసంద ర్భంగా గద్దర్ అభిమానులు శ్రీరాములు, గంధం కిషోర్, సుదర్శన్, పాదం శివన్న, శంకరరెడ్డి, మదన్, కృష్ణంరాజు తదితరులు ఉన్నారు. గద్దర్ కు వీరు విప్లవ జోహార్లు తెలిపారు.

గ్రంథాలయానికి 'కడుపాత్రం' పుస్తక వితరణ

చాపాడు : మైదుకూరుకు చెందిన ప్రముఖ కథా రచయిత, చరిత్రకారుడు తవ్వా ఓబుల్‌రెడ్డి తాను తాజాగా రచించిన కడు పాత్రం.. మరో పద్దెనిమిది కథలు అనే కథా సంపుటిని మైదుకూరులోని జిల్లా గ్రంథాలయ సంస్థ శాఖా గ్రంథాలయానికి ఆదివారం వితరణ చేశారు. స్థానిక గ్రంథాలయ అధికారి జి.సందీప్‌కుమార్ ఈ పుస్తకాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా సందీప్‌కుమార్ మాట్లాడుతూ రచయిత తవ్వా ఓబుల్‌రెడ్డి రచించిన గండికోట చరిత్ర, తెలుగు పౌరుషం, కడప కథ పుస్తకాలను కూడా గతంలో గ్రంథాలయానికి అందజేసినట్లు తెలిపారు.

నేడు వెదురూరులో ఆర్‌బికె ప్రారంభం

చాపాడు : మండల పరిధిలోని వెదురూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆర్‌బికె భవనాన్ని సోమవారం ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి ప్రారంభిస్తున్నట్లు ఎంపిపి టి.లక్షుమయ్య తెలిపారు. కార్యక్రమంలో మండలస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై అవగాహన

పులివెందుల రూరల్ : పులివెందుల జెన్‌టియు కళాశాలలో ఆదివారం హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో కడప రోడ్డులోని సోషల్ వెల్ఫేర్ స్కూల్, హాస్టల్‌లో కెరీర్ గైడెన్స్, వ్యక్తిత్వ వికాసంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఇందులో హెల్పింగ్ హాండ్స్ విద్యార్థులు వ్యక్తిత్వ వికాసం, కెరీర్ గైడెన్స్, మెమరీ టెక్నిక్స్ తదితర వాటి గురించి వివరించారు. ఎలా చదువుకోవాలి, ఎలా సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలో వివరించారు. ఆసక్తికర ఆటలు నిర్వహించారు. గెలిచిన వారికి బహుమతులు ప్రదానం చేశారు.

రక్షణగోడ ఏర్పాటు చేయాలని వినతి

పులివెందుల రూరల్ : పట్టణంలోని డిగ్రీ కాలేజీ రోడ్డులో ఉన్న వంతెన వద్ద ఇరుపక్కలా రక్షణగోడ ఏర్పాటు చేయాలని పాదచారులు, వాహనదారులు కోరుతున్నారు. రెండేళ్ల క్రితం ముందు ఈ వంతెనకు ఇరుపక్కలా రక్షణ ఉండేది, ఇటీవల వరద రావడంతో అవి కొట్టుకుపోయాయి. అప్పటి నుంచి ఇప్పటివరకు దీన్ని పట్టించుకున్న నాథుడే లేరని పేర్కొంటున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో ఈ దారిన వెళ్లాలంటే భయాందోళన చెందుతున్నామని పలువురు వాపోతున్నారు. విద్యుద్దీపాలు కూడా లేవు. ఏదైనా ప్రమాదం జరిగితే ఆ వంతెన కింద పడి పోవాల్సిందే. ఏదైనా ప్రమాదం జరగకముందే వంతెనకు రక్షణ గోడ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. వంతెన పై భాగంలో ఉన్న వాట ర్ పైపులు కూడా ప్రమాదకరంగా ఉన్నాయి. ఈ దారిన వెళ్లాలంటే తస్మాత్ జాగ్రత్త అంటున్నారు. లయోలా డిగ్రీ కళాశాల, పాలిటెక్నికల్ కళాశాల విద్యార్థులు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. అధికారులు స్పందించాలని కోరుతున్నారు.

నేడు కలెక్టరేట్ ముట్టడి

కడప అర్బన్ : మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఈనెల 7న కలెక్టరేట్‌ను ముట్టడిస్తున్నట్లు ఎపి మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు ఇత్తడి ప్రకాష్, సుంకరరవి పేర్కొన్నారు. ఆదివారం కార్మికులను ఉద్దేశించి వారు మాట్లాడుతూ నిన్న మొన్న వచ్చిన సచివాలయం సిబ్బందిని రెగ్యులర్ చేశారని పేర్కొన్నారు. హోమ్‌గార్డులకు స్కూటీలు పంపిణీ చేశారని, రేషన్ ఆటోలు, ఆర్టీసీ వారిని ప్రభుత్వంలోకి విలీనం చేశారని తెలిపారు. మున్సిపల్ కార్మికులకు మొండి చెయ్యి చూపిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇందుకు ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం పోరాట మార్గం తప్ప మరో మార్గం లేదని చెప్పారు. కార్మికులకు ఇచ్చిన హామీ మేరకు ఆప్కాస్ సిబ్బందిని రెగ్యులర్ చేయాలని కోరారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి స్పందించి ఇచ్చిన మాట, హామీలు అమలు చేయాలని కోరారు. లేని పక్షంలో రాబోయే రోజుల్లో ఆందోళన కార్యక్రమాలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అవసరమైతే నిరవధిక సమ్మెకు వెనకాడబోమని పేర్కొన్నారు. ప్రజలు ఇబ్బందులు పడితే అందుకు భాధ్యత ప్రభుత్వానిదే అన్నారు. కలెక్టరేట్ ముట్టడిలో ప్రతి ఒక్క విభాగంలోని సభ్యులు, అధ్యక్ష, కార్యదర్శులు, మహిళలు తమ వంతు భాధ్యతగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ప్రభుత్వ స్థలంలో ఆక్రమణలు తొలగింపు

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

ప్రభుత్వ స్థలంలోని అక్రమ నిర్మాణాలను తొలగించి, స్వాధీనం చేసుకున్నట్లు తహశీల్దార్ సి.ఆర్.మంజుల తెలిపారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ మండలంలోని వెంగంవారిపల్లి పంచాయతీ బాలినాయనపల్లికి చెందిన చాకలి వెంకటస్వామి కుమారుడు చాకలి రఘు అనే వ్యక్తి బాలినాయనపల్లిలోని సర్వే నెంబరు 810/13 లోని ప్రభుత్వ స్థలాన్ని కొంతమేర ఆక్రమించుకొని అక్రమ నిర్మాణాలు చేపట్టారని అన్నారు. ఇందులోనే పాల కేంద్రం దుకాణాన్ని ఏర్పాటు చేసుకుని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీనిపై గత కొన్ని నెలలుగా గ్రామస్తులు అక్రమ నిర్మాణాలను తొలగించి ప్రభుత్వ భూమిని కాపాడాలని, అక్కడ బస్సు షెల్టర్ నిర్మించాలని రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేస్తూ వస్తున్నట్లు పేర్కొన్నారు. అక్రమ నిర్మాణాలను తొలగించాలని పలుమార్లు హెచ్చరించిన అతను స్పందించలేదన్నారు. ఈ విషయమై గత మూడు నెలలుగా గ్రామస్తులు జగనన్నకు చెబుదాం, స్పందన కార్యక్రమానికి ఫిర్యాదు చేశారన్నారు. గత వారంలో ఎమ్మెల్యే నవాజ్‌బాషా గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని నిర్వహిస్తుండగా బాలినాయనపల్లి గ్రామస్తులు, యువత ప్రభుత్వ భూమి ఆక్రమణపై ఎమ్మెల్యే కు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. అక్రమ నిర్మాణాలను తొలగించి గ్రామస్తులకు, యువతకు, విద్యార్థులకు అవసరమైన బస్సు షెల్టర్ ను అక్కడ నిర్మించాలని కోరారని చెప్పారు.



అక్రమ నిర్మాణాలను తొలగింపజేసిన రెవెన్యూ సిబ్బంది

దీనితో ఎమ్మెల్యే వెంటనే సానుకూలంగా స్పందిస్తూ అక్రమ నిర్మాణాలు కలిగిన భూమిని పరిశీలించి, ప్రభుత్వ భూమిలోని ఆక్రమణలను తొలగించాలని ఆదేశించారని అన్నారు. ఆ భూమిని ప్రభుత్వ భూమిగా గుర్తించి, అక్రమ నిర్మాణాలను జెసిబి సాయంతో తొలగించి పంచాయతీ అధికారులకు అప్పగించినట్లు తెలిపారు. ప్రభుత్వ భూములను ఆక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో తహశీల్దార్ సి.ఆర్.మంజుల, ఎస్ఐలు రామకృష్ణ, చంద్రశేఖర్, విఆర్ఒ వసంత కుమారి, విఆర్ఎలు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఆస్పత్రి ల్యాబ్ భవన నిర్మాణానికి భూమిపూజ



భూమి పూజలో పాల్గొన్న జడ్‌పిటిసి, సర్పంచ్

ప్రజాశక్తి-రామాపురం

స్థానిక పిహెచ్‌సి పరిధిలో రూ.50 లక్షల వ్యయంతో ఆస్పత్రి ల్యాబ్ భవన నిర్మాణానికి ఆదివారం గుత్తేదారు కొండ బలరాం రెడ్డి సాంధ్యంలో జడ్‌పిటిసి మాసన వెంకటరమణ, సర్పంచుల సంఘం అధ్యక్షులు అయోధ్యపురం నాగభూషణ్ రెడ్డిలు భూమి పూజను నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఆస్పత్రిలో అన్ని సౌకర్యాల ఎన్నా ల్యాబ్ సౌకర్యం సక్రమంగా లేకపోవడంతో ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఎమ్మెల్యే కలెక్టర్‌తో చర్చించి ప్రత్యేక నిధులు మంజూరు చేయించారని హర్షం వ్యక్తం చేశారు. ల్యాబ్ భవనం నిర్మాణమైతే అన్ని రకాల వ్యాధులకు సంబంధించి దూర ప్రాంతాలకు వెళ్లకుండా ఇక్కడే అన్ని రకాల రక్తపరీక్షలు నిర్వహిస్తారని చెప్పారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కర్ణపు విశ్వనాధ్ రెడ్డి. మాజీ ఎంపీపీ జనార్దన్ రెడ్డి. వెంకటకృష్ణారెడ్డి. రమేష్ రెడ్డి. ప్రసాద్ రాజు సూర్యనారాయణ రెడ్డి. ఆస్పత్రి సిబ్బంది, పాల్గొన్నారు.

పెద్దిరెడ్డిది చంద్రబాబులా దిగజారే తత్వం కాదు

రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ అబ్దుల్ కలీమ్

ప్రజాశక్తి - వాల్మీకిపురం

రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిది టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు వలే దిగజారే తత్వం కాదని రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ అబ్దుల్ కలీమ్ అన్నారు. ఆదివారం జరిగిన కార్యక్రమంలో రాజంపేట పార్లమెంటరీ నియోజకవర్గ వైసిపి కార్యదర్శి వెంకటరమణతో కలిసి ఆయన మాట్లాడుతూ పుంగనూరు, అంగళ్లులలో జరిగిన విధ్వంసానికి , పోలీసులు, ప్రజలపై జరిగిన దాడులకు టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు చేసిన రెచ్చగొట్టే వ్యాఖ్యలే కారణమన్నారు. 40 ఏళ్ల ఇండస్ట్రీ, 14 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా పని చేశానని గొప్పలు చెప్పుకునే చంద్రబాబు నాయుడు జలాశయాల పరిశీలన పేరిట సాగిస్తున్న యాత్ర రైతుల ప్రయోజనాల కోసం ఉద్దేశించినది కాదని, కేవలం రెచ్చగొట్టే వ్యాఖ్యలతో ఘర్షణలకు ఆజ్యం పోసి శాంతి భద్రతల సమస్యను సృష్టించేందుకే అన్నారు. తాను ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఏ ఒక్క ప్రాజెక్టును కూడా పూర్తి చేయని పెద్దమనిషి, పుంగనూరు, తంబళ్లపల్లె నియోజకవర్గం వర్గాల్లో రైతుల శ్రేయస్సు కోసం నిర్మించ తలపెట్టిన మూడు



మాట్లాడుతున్న రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ అబ్దుల్‌కలీమ్

ప్రాజెక్టుల నిర్మాణానికి కోర్టులో కేసులు వేయించి అడ్డుకోవడం దారుణమన్నారు. ంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి దిగజారుడు రాజకీయాలకు పాల్పడరని, ప్రజలకు సేవలు అందించడం ద్వారా వారి మనసులను గెలుచుకుంటారన్నారు. కుట్రలు, కుతంత్రాలు, వెన్నుపోటు రాజకీయాలకు చంద్రబాబు నాయుడు కేరాఫ్ అడ్రస్ అని, ఆయనకు ఈ విద్యలు పుట్టుకతో వచ్చాయని విమర్శించారు.

లాభాల బాటలో బీర సాగు



బీరకాయలను ప్యాక్ చేస్తున్న కూలీలు

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలో సాగుచేసిన బీర పంట రైతులకు లాభాలను చేకూరుస్తున్నాయి. మండల పరిధిలోని సీతారామపురం, రాజుపాలెం, తిప్పిరెడ్డి పల్లె గ్రామ పరిధిలో బీర పంటను రైతులు సాగు చేపట్టారు. ఎకరాకు కోతకు రెండు టన్నుల వరకు దిగుబడి వస్తుందని, మూడు నాలుగు రోజులకు ఒకసారి దిగుబడి వస్తుందని రైతులు చెప్పారు. కిలో రూ.30 లెక్కన ప్రొద్దుటూరు, హైదరాబాదు, నెల్లూరు, తిరుపతి వంటి ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు. వ్యాపారులే పంటపొలాల వద్దకు వచ్చి కొనుగోలు చేసి తీసుకెళ్తున్నారు. రైతు స్వయంగా పంటను తరలిస్తే మరో రెండు రూపాయలు అదనంగా చెల్లిస్తున్నట్లు చెల్లిస్తారు. ఎకర సాగుకు రూ. 50 వేల వరకు ఖర్చులు అవుతున్నాయని పేర్కొంటున్నారు. ఎరువులు, పురుగు మందుల ధరలు అధికంగా ఉండడంతో మరింత ఖర్చు పెరగనుంది. పది రోజులుగా ఎండ తీవ్రతకు చెట్లు దెబ్బతింటున్నాయని, దిగుబడి సరిగా లేదని రైతులు పేర్కొంటున్నారు. కర్రల పైన బీర సాగు చేపట్టడం వల్ల కాయలు పొడవుగా ఏర్పడి మంచి దిగుబడి వస్తుందని పేర్కొంటున్నారు. సీతారామాపురం గ్రామ పరిధిలో 10, మండల పరిధిలో వివిధ గ్రామాల్లో 10 ఎకరాల్లో సాగు చేపట్టారు. అట్టపెట్టెలలో బీరకాయలను పేడ్చి ఇతర ప్రాంతాలకు రవాణా చేస్తున్నారు. వరి పంట సాగు అనంతరం కూరగాయలు సాగు చేయడం వల్ల మంచి ఫలితాలు వస్తున్నాయని రైతులు చెబుతున్నారు.

హ్యాండ్‌బాల్ ఎంపికలకు విశేష స్పందన

క్రీడాకారులకు చేయూతనందిస్తాం : లయన్స్ క్లబ్



క్రీడాకారులతో లయన్స్ క్లబ్ ఆఫ్ కడప, అన్నమయ్య అధ్యక్షులు పోతుల వెంకటరామిరెడ్డి

ప్రజాశక్తి - కడప అర్బన్

నగరంలోని డీఎస్ఎ క్రీడా మైదానంలో ఆదివారం నిర్వహించిన జిల్లాస్థాయి హ్యాండ్ బాల్ సీనియర్ విభాగం ఎంపికలకు చక్కటి స్పందన లభించింది. ఈ ఎంపికలకు ముఖ్యఅతిథిగా లయన్స్ క్లబ్ ఆఫ్ కడప, అన్నమయ్య అధ్యక్షులు పోతుల వెంకటరామిరెడ్డి విచ్చేసి ఎంపికలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని తెలిపారు. జిల్లా జట్టుకు ఎంపికయ్యే క్రీడాకారులు బాగా సాధన చేసి రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించి జిల్లాకు పేరు ప్రఖ్యాతులు తేవాలని సూచించారు. హ్యాండ్ బాల్ క్రీడలో జిల్లా నుంచి ఎందరో క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించారన్నారు. వారిని ఆదర్శంగా తీసుకొని క్రీడల్లో రాణించాలని కోరారు. జిల్లా ఒలంపిక్ సంఘం అధ్యక్షులు కె.ఎన్.సమరనాథరెడ్డి మాట్లాడుతూ క్రీడాకారులను క్రమశిక్షణ, నిరంతర సాధన, క్రీడాస్ఫూర్తి విజేతలుగా నిలుపుతాయన్నారు. జియోన్ వ్యాయామ కళాశాల చైర్మన్ రాజరత్నం ఐజాక్ మాట్లాడుతూ క్రీడాకారుల అభివృద్ధికి క్రీడాసంఘాలు కృషి చేయాలని సూచించారు. ఎపి వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షులు బి.శివశంకర్‌రెడ్డి మాట్లాడుతూ క్రీడాకారులకు గెలవాలన్న పట్టుదల, కసి ఉంటేనే ప్రత్యర్థి జట్టుపై విజయం సాధించగలరన్నారు. క్రీడాకారుల అభివృద్ధికి అహర్నిశలు పాటుపడుతున్న హ్యాండ్ బాల్ సంఘం కృషిని ఆయన అభినందించారు. జిల్లా హ్యాండ్ బాల్ సంఘం కార్యదర్శి సింధూరి, ఆర్గనైజింగ్ సెక్రటరి శివప్రసాద్ మాట్లాడుతూ జిల్లా జట్టుకు ఎంపికయ్యే క్రీడాకారులు ఈనెల 19, 20 తేదీల్లో ఒంగోలులో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందన్నారు. జిల్లా జట్టుకు ఎంపికయ్యే క్రీడాకారులకు క్యాంపు నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకుని క్రీడా ఎంపికలను ప్రారంభించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ కడప, అన్నమయ్య కార్యదర్శి కొండూరు జనార్ధనరాజు, కోశాధికారి దేవతి రవీంద్రనాథ్, హ్యాండ్ బాల్ శిక్షకుడు అబ్దుల్ మునాఫ్, సీనియర్ క్రీడాకారులు సాయికిశోర్‌రెడ్డి, బసిరెడ్డి, పవన్‌కుమార్, కోటేశ్వరరావు, క్రీడాకారులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన

వేంపల్లె : ఆవోపా ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత హోమియో వైద్య శిబిరానికి అపూర్వ స్పందన వచ్చినట్లు ఆవోపా అధ్యక్షుడు పుల్లగూర గోవర్ధన్ తెలిపారు. స్థానిక శ్రీవాసవి కన్యక పరమేశ్వరి ఆలయంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. దాదాపు 180 మంది రోగులకు ఉచిత వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పుల్లగూర గోవర్ధన్ మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరం ఏర్పాటుకు కొప్పరపు రాజగోపాల్, రుషేం ద్రమణీ ఆర్థికసాయం చేశారని పేర్కొన్నారు. కడపకు చెందిన వైద్యులు క్రిష్టిపాటి శేష ఫణి వైద్య పరీక్షలు చేశారని తెలిపారు. కార్యక్రమంలో ఆవోపా గౌరవా ధ్యక్షు రాలు నాగసుధా, ఆర్గనైజేషన్ సభ్యులు సాయి, సత్యనారాయణ, రాధా కృష్ణ, రాము, శివ కిరణ్, శివ అరుణ్, సాయి కిరణ్, కౌసిక్, మధుకర్ పాల్గొన్నారు.

అలరించిన చిన్నారుల నృత్యాలు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

స్థానిక శిల్పారామంలో ఆదివారం చిన్నారులు ప్రదర్శించిన నృత్యాలు ప్రేక్షకులను ఎంతగానో అలరించాయి. ట్రిపుల్ ఆర్ హోటల్, కేఫ్ వారి సహకారంతో శ్రీరాజా కళా నిలయం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. పెద్ద సంఖ్యలో ప్రజలు ప్రదర్శనలను తిలకించారు. నృత్య శిక్షకుడు రాజా, స్నేహిత అమృతహస్తం సేవాసమితి అధ్యక్షులు రాజు, శిల్పారామం పరిపాలన అధికారి సుధాకర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు. **కడప అర్బన్ :** నగరంలోని శిల్పారామంలో ఆదివారం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను ఎంతగానో అలరించాయి. ఆదివారం బ్రహ్మకుమారి ఈశ్వరి విశ్వవిద్యాలయం సిస్టర్ ప్రతిభ విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు.కార్యక్రమంలో శిల్పారామం సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న దర్శకుడు రవికిరణ్

'వేట మొదలైంది' సినిమా చిత్రీకరణ ప్రారంభం

ప్రజాశక్తి-పీలేరు

పీలేరుకు చెందిన హీరో, విలన్ తో కలిసి తాను 'వేట మొదలైంది' పేరుతో ప్రొడక్షన్ నెంబర్-2 సినిమా చిత్రీకరణ ప్రారంభిస్తున్నట్లు దర్శకుడు రవికిరణ్ తెలిపారు. ఈ సందర్భంగా తిరుపతి అబ్బన్న కాలనీలోని చిన్నారి ఆస్పత్రి సమీపంలో ఆదివారం 'నవతరం సినీ ప్రొడక్షన్స్' నూతన కార్యాలయం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ గతంలో తన దర్శకత్వంలో నిర్మించిన 'లవ్‌టు లవ్' ప్రొడక్షన్ నెంబర్-1చిత్రం రాష్ట్రంలోని 75 కేంద్రాల్లో విడుదలైందని అన్నారు. రూ.2 కోట్ల బడ్జెట్ తో వేట మొదలైంది చిత్రం ప్లాన్ చేశామని చెప్పారు. ప్రముఖ సినీ నటులు ఇందులో ప్రధాన పాత్రల్లో నటించనున్నారని అన్నారు. హీరోగా పొన్నా మునీంద్ర, హీరోయిన్‌గా అర్చన రాయల్ శెట్టి, ప్రధాన ప్రతినాయకుడి పాత్రలో చల్లా రాంబాబునాయుడు నటిస్తున్నట్లు తెలిపారు. తిరుపతిలో పుట్టి పెరిగిన తాను పీలేరు నియోజకవర్గంలోని కలికిరి మండలం, మంచూరు స్వగ్రామమన్నారు. హీరో మునీంద్ర, విలన్ చల్లారాంబాబు నాయుడులు కూడా పీలేరు వాసులేనని తెలిపారు. సమావేశంలో కెమెరామన్ క్రిస్టఫర్, చిత్ర యూనిట్ సభ్యులు పాల్గొన్నారు.



ఇంటర్న్‌షిప్‌లో పాల్గొన్న విద్యార్థులు

'ఇంటర్న్‌షిప్'లో 'మిట్స్' విద్యార్థులు

ప్రజాశక్తి-కురబలకోట

స్థానిక మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలోని ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగం లో బి.టెక్ మూడవ సంవత్సరం చదువుతున్న ఎ. నిరంజన్, ఎ. వెంకట్, బి.కిషోర్, ఆర్.శశికుమార్, ఎం.శివ శంకర్, ఎం.గోవిందులు నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నికల్ టీచర్స్ ట్రైనింగ్ అండ్ రీసెర్చ్ చెన్నైలో నాలుగు వారాలు ఇంటర్న్‌షిప్‌లో పాల్గొన్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్ తెలిపారు. మల్టీ సిం, ఐఒటి మాట్ ల్యాబ్ రోబోటిక్స్ ఉపయోగించి సర్క్యూట్ అనుకరణపై నాలుగు వారాలు ఇంటర్న్‌షిప్‌లో పాల్గొంటారని అన్నారు. విద్యార్థులను కళాశాల కరెస్పాండెంట్ విజయ భాస్కర్ చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తినాదెళ్ల, ప్రిన్సిఎల్ డాక్టర్ సి. యువరాజ్, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ రామనాథన్, విభాగాధిపతి డాక్టర్ రాజశేఖరన్ అభినందనలు తెలిపారు.

సుధీర్‌రెడ్డికి ఆర్థిక శాస్త్రంలో డాక్టరేట్

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

పట్టణానికి చెందిన మార్తల సుధీర్‌రెడ్డి ఆర్థికశాస్త్రంలో డాక్టరేట్ పొందినట్లు గ్లోకల్ విశ్వ విద్యాలయ అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. సుధీర్‌రెడ్డి ఆచార్య డాక్టర్ అంజనీకుమారి జా పర్యవేక్షణలో 2011-12 నుండి 2020-21 వరకు భారతదేశంలోని ప్రైవేట్ సెక్టార్, ప్రభుత్వ రంగ బ్యాంకులలో పని చేయని ఆస్తుల తులనాత్మక అధ్యయనం అనే అంశం మీద పరిశోధన చేశారు. ఈ పరిశోధనకు గానూ గ్లోకల్ విశ్వవిద్యాలయం నుండి డాక్టరేట్ అవార్డు లభించింది.

ఉర్దూ విభాగ ఆచార్యుల పోస్టులు మంజూరు చేయండి

ప్రజాశక్తి - కడప అర్బన్

యోగి వేమన విశ్వవిద్యాలయం పీజీ ఉర్దూ విభాగానకు ప్రొఫెసర్ల (ఆచార్యుల) పోస్టులు మంజూరు చేయాలని రూట లెక్చరర్స్ వింగ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ సయ్యద్ వసివుల్లా, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు సత్తార్ ఫెజీ కోరారు. ఆ మేరకు ఆదివారం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఎస్.బి.అంజాద్ బాషాకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ సయ్యద్ వసివుల్లా మాట్లాడుతూ 2017 నుంచి కేవలం కాంట్రాక్ట్ లెక్చరర్లతోనే బోధన సాగిస్తున్నారని, ఇప్పటికైనా పోస్టులు మంజూరు చేసి భర్తీ చేయాలని కోరారు. ఇందుకు ఎస్‌బి అంజాద్ బాషా స్పందిస్తూ పోస్టులు మంజూరు చేసి భర్తీ చేయడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రూట రాష్ట్ర సమన్వయ కర్త ముహమ్మద్ అయ్యూబ్, డైరీ కమిటీ కో-చైర్మన్ సయ్యద్ సిరాజుద్దీన్, అకడమిక్ వింగ్ రాష్ట్ర కన్వీనర్ మస్తాన్‌వలి, నాయకులు సర్దార్ మైనుద్దీన్, ఇంతియాజ్ పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న రూట నాయకులు

క్రైం కార్నర్

విద్యార్థిని అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి-పీలేరు

ఇంటర్ విద్యార్థిని అనుమానాస్పద స్థితిలో హంద్రీనీవా కాలువలో పడి మృతి చెందిన సంఘటన మండంలోని అగ్రహారం పంచాయతీ, గుర్రంవారిపల్లి సమీపంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు ఆదివారం చోటు చేసుకున్న ఘటనా వివరాలిలా ఉన్నాయి. గుర్రంవారిపల్లెకు చెందిన రమణ కుమార్తె కీర్తి(17) పొలం దగ్గరకు వెళ్లి తిరిగి ఇంటికి రాక పోవడంతో తల్లి దండ్రులు కీర్తి కోసం పొలం దగ్గరకు వెళ్లి వెతుకుతుండగా అక్కడి హంద్రీ-నీవా కాలువలో కీర్తి అనుమానాస్పద స్థితిలో పడి ఉండడాన్ని గుర్తించారని అన్నారు. హుటాహుటిన ఆ బాలికను పీలేరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందిందన్నారు. విషయం తెలుసుకున్న అర్బన్ సిఐ మోహన్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని అక్కడి పరిస్థితులను పరిశీలించి, దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు. కీర్తి మృతి చెందిన ప్రదేశం సదుం పోలీస్ స్టేషన్ పరిధి కావడంతో అక్కడి పోలీసులు కూడా సంఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి ధర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

వ్యక్తిపై కొడవలితో దాడి : కేసు నమోదు

ప్రజాశక్తి-పెద్దమండ్యం

భూతగదలతో వ్యక్తి పై కొడవలి తో దాడి చేసిన సంఘటన ఆదివారంమండల కేంద్రంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. పెద్దమండ్యంకు చెందిన హుసేన్‌బేగ్ కుమారులుకు భూతగదలు ఉండేవన్నారు. అల్లబకాష్ కుమారుడు ఖాదర్‌బాషా అమీర్‌బేగ్ మధ్య బోరు నీళ్ల వద్ద ఘర్షణ జరిగిందన్నారు. ఈ ఘర్షణలో ఖాదర్‌బాషాను అల్లబకాష్ కొడవలితో మెడపై దాడి చేయడంతో 108 వాహనంలో రాయచోటి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు చెప్పారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించినట్లు పేర్కొన్నారు. ఈఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రామంజనేయుడు తెలిపారు.